UNIVERSAL LIBRARY
OU_204292
UNIVERSAL LIBRARY

# అంబ

## మొండిశిఖండి

గ్రంథకర్త:

డాక్టరు చిలుకూరి నారాయణరావు,
ఎమ్.ఏ., పిఎచ్.డి., ఎల్.టి.,
అనంతపురము.

# మనవి మాట.

క్రొత్తతీరున నాటకకళ నభివృద్ధి చేయవలె ననే ఉద్దేశముతో వ్రాసిన దీనాటకము.

వ్యావహారిక భాషలో నెట్టి కావ్యములనైనా రచించి, ఎంతటి ఆనందమునైనా కలిగించవచ్చునని రూఢీచేయడానికి వ్రాసిన దీనాటకము.

పాటల, పద్యముల సంగీతములో మరుగుపడిపోయిన భాషను, స్వాభావిక సంభాషణ క్రమమును తిరిగీ ప్రకాశింపజేయడానికి వ్రాసిన దీనాటకము.

కనుక, నాటకకళోపాసకులకు మనవి యేమంటే,

అయ్యా!

ఈనాటకమును మీరు ప్రదర్శించేటప్పుడు,
దీనిలోనిభాషను గ్రాంథికము చేయకండి.
పద్యాలూ, పాటలూ, ఎవరిచేతనైనా వ్రాయించుకొని,
నానాటకమును ప్రాతధోరణిలోనికి దింపి,
నాఉద్దేశమునకు భంగము కలిగించకండి.

సహజమైన మాటతీరు, సహజమైన అభినయము, ఉంటే, ఈనాటకము రంగస్థలముమీద అద్భుతమైన రక్తి కట్టుతుందని నావిశ్వాసము. నటకులు నావిశ్వాసమును సార్థకపరుస్తారని నమ్ముతున్నాను.

చి. నా.

# పాత్రములు:

అంబ (నాయిక)
అంబిక
అంబాలిక } కాశీరాజు పుత్రికలు.

కాశీరాజు: అంబాంబికాంబాలికల తండ్రి.

సాళ్వరాజు: అంబకోసము భీష్మునితో యుద్ధముచేసిన రాజు.

భీష్ముడు: కథానాయకుడు.

పరశురాముడు: భీష్మునిగురువు.

కుబేరుడు.

స్థూలకర్ణుడు: కుబేరుని వనపాలకుడు.

అర్జునుడు.

కృష్ణుడు.

శిఖండి: అంబ పునర్జన్మము పొందినవాడు, ద్రుపదరాజు పుత్రుడు.

దేవదూత.

రెండుపిశాచములు.

పప్పుశాస్త్రి
నేతావధానులు } ఇద్దరు బ్రాహ్మణులు.

# ప్రథమాంకము.

[ప్రవేశము:— అంబ, అంబిక, అంబాలిక:— అంబ తెల్లని చీర కట్టుకొన్నది, చేతికి బంగారు గాజులు, కాళ్లకేమీ లేవు. వంకపాపట, చెంపకొప్పు, మొగముమీద నల్లనిచుక్క, మగరొమ్ము, పైటచెరగు ప్రక్కకు జారవదలినది. — అంబిక నల్లనిచీర కట్టుకొన్నది. చేతికి గాజులు, కాలికి అందెలు, కడియములు, మధ్యపాపట, మొగముమీద దమ్మిడీఅంత కుంకుమబొట్టు, మెడలో ఆభరణములతోబాటు నల్లపూసలు. మిట్టకొప్పు. — అంబాలిక అంబికవలెనే కాని, కాషాయ రంగు చీర. ప్రదేశము:— కాశీరాజు కోటలో మేడడాబా (మిద్దె) ]

అంబిక: అంబక్కా!

అంబ: ఏమే, అంబిక్కా!

అంబాలిక: అక్కా, ఇంకా పిల్లాటలేనటే, రా, కూర్చో.

అంబ: చాలులేవే, అంబాలిక్కా. నావిపిల్లాటలా! మీవి పెద్దాటలేమో! ఆ ఆటలకోసమే కాబోలు మిద్దెక్కి నిక్కి నిక్కి చూచేది. వస్తాడులే ఎవడో ఒకడు; ఇకముం

గుండె నే ఉన్నది, కులికిపోవడం, పిల్లలను కనడం, చప్పి
డవడలుపడడం. ఏమిటూ ఉబలాటం? నీమాటూ? నీమంతా!

అంబిక: రాచబిడ్డలము గదా, మన కిష్టమువచ్చినవారిని వరించుకో వచ్చు.

అంబ: నీ కిష్టముకూడానూ? ఈవిషయమై తలంచేకొద్దీ నాఒళ్ళు మండిపోతున్నది. నేనే మగవాడి నయితేనా!

అంబాలిక: మగవాడివయితేనా! దానికేముంది? మనస్సులో మొదటి నుంచీ మగవాడివే. ఆకారములో కొంతపోలిక ఉండనే ఉంది. మీసాలు, గడ్డాలు, ఈరెండే తక్కువ. అవికూడా తగిలించుకొని, అంగీ, షరాయి వేసుకో; ఒక రుమాల తలకు చుట్టుకో. వేషం పూర్తిఅవుతుంది. అపయిమాటూ? అది నైవేచ్ఛ. ఓ! ఎంతమందిలేరు? ఆడమగవాళ్ళు!

అంబ: అట్లాగేమి? అంత ఇదిగాఉందామీకు? మగవాడుకావడం అది ఒక పెద్దపనను కొన్నారేమో!

అంబిక: ఏదీ చూదాము, మగవాడివికా!

అంబ: పాపము, మగవాళ్ళ నెప్పుడూ చూడలేదేమో. మీ వేడుక తీరుస్తానుండండి. (అని పోతున్నది.)

అంబాలిక: అక్కా, అంబనుంచి మనకు తలవంపులుగా ఉందే. సిగ్గూ, బిడియం లేదు. ఇంటి కెవరయినా మగవాళ్ళు వస్తే తొంగి తొంగి చూస్తుంది. వాళ్ళనుచూచి వెక్కిరిస్తుంది. ముక్కులు విరుస్తుంది, మూతులు విరుస్తుంది. వాళ్ళెవరైనా చూస్తే?

అంబిక: చూస్తే దానిఖర్మం. దీనికి పెళ్ళయేయోగం లేదుకాబోలు.

అంబాలిక: దానికి పెళ్ళికాకపోతే, దానికంటే చిన్నవాళ్ళము మన కెట్లా అవుతుందీ?

అంబిక: అదృష్టముంటే అవుతుంది. ఈవిషయమై ఆలోచించే నాయనగారు ఒక ఉపాయ మాలోచించారట.

అంబాలిక: ఏమాలోచించారు?

అంబిక: ఏమీలేదు. మనముముగ్గురము విడిపోకుండా ఒక్కయింటి కోడళ్ళము కావలెనని నాయనగారి ఉద్దేశము.

అంబాలిక: ఒక్కయింటి కోడళ్లమే కాకుండా, ఒక్కనికే ముగ్గుర మున్ను భార్యలమయితే మరీమంచిదిగదా.

అంబిక: నాయనగారి కోరిక అదికూడాను. అట్లయితే అంబమీద

మనమగనికి కోపంవస్తే, ఆకోపాన్ని మనం తీరుస్తూ ఉండవచ్చును.

అంబాలిక: మనము పెళ్లిచేసుకొని ఇదేపనికాబోలును! అంబ మగనికి కోపం తెప్పించకుండా ఉండేదెప్పుడు? మనము తీర్చవలసినది మగనికోపం కాదు: దీనిహఠం. ఈమాచకమ్మను మగడు ప్రేమిస్తాడా, ఏమన్నానా! ఇది సంవత్సరానికి రెండుసార్లు హారం పట్టుతుంది. పట్టినప్పు డారునెల లుంటుంది ఆహారం. దీనితో మనము వేగలేమమ్మా. మన మిద్దరం ఒక్కని పెండ్లిచేసుకొందాము. దానిమొర దానిది. తనయిష్టము వచ్చినవానిని వేరేపెండ్లిచేసుకోనీ. చేసుకోక పోతే అగ్గిలోఉరకనీ. మనకేల!

అంబిక: అదిగో ఎవరోమగవాళ్లువస్తున్నారు. లోపలికిపోదాముపద.

అంబాలిక: (పకపక నవ్వుతూ) మగవాళ్లుకాదే, మగాయమ్మ. మన అంబే. పిచ్చిముండ. వేషంవేసింది. బాగానేకుదిరిందిగాని—

(అంబ ప్రవేశిస్తున్నది. చీరమీదనే అంగీవేసుకొన్నది. ఒకచీర తలకు చుట్టుకొన్నది. పాగాలో నెమలి ఈకలుపెట్టినది. మీసాలు పెట్టుకొన్నది. చేతిలో ఒక కత్తి.) — — — —

అంబ: కాంతలారా, భయమువలదు. తొలగిపోనేల! నేనన్యుడను కాను. మీదాననే. (చేయికరచుకొని) మీవాడనే. ఇన్నాళ్లును మీకీవేషము పరిచితము కాక పోవచ్చును, కాని –

అంబిక: చెల్లీ. ఇదేమిటే ? నాటకమాడవచ్చిందికాబోలు !

అంబ: ఆరాళకుంతలలారా! నిజము. నాటకమాడుటకే వచ్చినాను. ఈ జగమంతయు నాటకరంగము కాదా? అందులో మనము పాత్రధారులము కామా? జగన్నాటక సూత్రధారుడు మన మేయే పాత్రములను ధరించి నటియింప నియమించినాడో, వానిని మనశ్శక్తివంచన లేకుండ నాడియేతీరవలెను.

అంబాలిక: అంబా, సూత్రధారుడు నీకే పాత్రము ధరింపమని నియమించాడే ?

అంబిక: చెల్లీ, చూడలేదే, దానితలమీద శిఖండము ? దానిది మొండి శిఖండిపాత్రము.

అంబ: ఇదిగో, నన్ను మొండిశిఖండి అంటావా? చూడేమిచేస్తానో! (గొంతుక మార్చి) అబలలారా! ప్రచండ విక్రమోద్దండ మార్తాండమండలాఖండప్రతాపుండును, భూరిభేరీ

భాంకారారవ సమరస్థలీ విదారితారాత్యఖర్వ గర్వ నిర్వా
పనుండును,—

అంబాలిక: ఇదేమిటే !

అంబ: ఛఛ్, ఉండండి (గొంతుకమార్చి) సాధన బాధక, మోదక
చోదక, మారకనారక,—

అంబిక: (అందుకొని) ఊరక ప్రేలక—

అంబ: హాయ్!

అంబాలిక: చాలక మూలకు పోవక—

అంబ: అబ్బా! అంబాలికా, నీకూవచ్చునే కవిత్వం? మీరు
నోరుమూసుకొని నేను చెప్పేదివినండి. — ఎక్కడవదలే
శానో — కాని, పద్యమారంభిస్తాను.—
"నరనాగాశ్వవరూథయూథములతో నానావనీనాథు లు
ద్ధురులై ... ...

అంబిక: ఎక్కడిదే ఈపద్యం? ఎక్కడో విన్నట్టుంది?

అంబ: హుష్.
"యొక్కట నొండొరుం జఱచి"

అంబాలిక: ఎక్కడే ? ఎవరూ ?

అంబ: ఉంధ్మా — గుక్క తిరగకుండా సమాసం సాగిస్తే సరి, మరి మాట్లాడరు.

"యుత్తుంగానిలోద్ధూతసా,
గర సంఘోషసమంబుగాఁ గలఁగి"

అంబిక: అప్పుడే తెగిపోయిందేమే, మన సమాసం ?

అంబ: మన సమాసం తెంపుతానులే. ఓపికపట్టు.—

"వీఁకన్ వీరుడై తాఁకి యే
సిరి"

అంబాలిక: అక్కా, మీసాలెక్కడ సంపాదించావే ?

అంబ: జుట్టు కత్తిరించి పెట్టుకొన్నాను. అయితే, నాపద్యం సాగనియ్యదలచుకోలేదా?

అంబిక: కానియ్యి.

అంబ: రాగం మరచిపోయినాను. అఁ—

"దేవవ్రత! కామకో విడఁతు నచ్ఛిద్రంబుగా నమ్ములన్"

(అని కత్తి ఝళిపిస్తున్నది.)

అంబిక: దేవవ్రతు డెవడే, వాడిమీద దాడిసాగించావు ?

అంబ: (తలపంకిస్తూ) ఎవడా? వాడే! వాడికోసమే నేనుపుట్టినది.

అంబాలిక: ఓహో ఉన్నాడూ? కన్నువేశావూ? చిన్నదానవే కాని "శీఘ్రమేవ వివాహసిద్ధిరస్తు."

అంబిక: అఛ్ఛీ! "వివాదసిద్ధిరస్తు" అంటావేమే పాపం!

అంబ: వివాహసిద్ధి అయితే వివాహసిద్ధి; వివాదసిద్ధి అయితే వివాదసిద్ధి. ఏదయినా ఆయనకు కాయశుద్ధితప్పదు.

అంబాలిక: దేవవ్రతుడంటే శంతనుమహారాజు కొడుకేకదూ? అతగాడు పెండ్లిచేసుకోడంటనే!

అంబ: చేసుకోకపోతే పీడాపోయింది. లోకములో దేవవ్రతుడు వాడొక్కడే ఉన్నాడేమి? ఓ! ఎంతోమంది. దేవతల వ్రతము కలవారంతా దేవవ్రతులే.

అంబిక: అయితే దేవతాభక్తికలవారందరిమీదా నీకు ద్వేషమన్న-మాటే?

అంబ: దేవతలేకాని, దయ్యాలేకాని, నామీద భక్తి, గౌరవము లేనివారందరిమీదా నాకుద్వేషమే. ఇదిగో మాటలలోనికి దింపి నానాటకం మరపించారు.—

"ఓరీ, దేవవ్రతా, ఏమినీకండకావరము? జగమున నీ వొక్కరుడవే వీరుడవా? నీసరివీరులు లేరనుకొంటివేమో! ఈ (అంబికాంబాలికలను చూపి) యబలల నెత్తికొనిపో నెంచితివా! ఈ శిఖండి మేన —

అంబాలిక: మొండిశిఖండి మేన—

అంబ: హుం!—"ఈ మేనఁ బ్రాణములుండ నీకన్యకల నీ కైవస మొనర్తునే? కల్ల. కల్ల. కల్ల.

"నీ సైన్యంబులు నాపయింగవిసి రా– నీ, రాకపోనీ, భవ ద్దాసుల్ నీ కనుసన్నలో మెలఁగి యీ– తన్వంగులంబట్టి నీ వాసంబుందరిఁజేర్చనీ, తెలుపుతో– వైశంబపోనీ, యిదే వాసిన్నిన్ను జయించి, మించి, తలవం–పంజేతు నిక్కంబుగన్"

అంబిక: బలే, బలే.

అంబాలిక: శభాష్! శుభ్రణుత! శుభ్రణుత!

అంబ: నాకు రాదనుకొన్నావేమో సంస్కృతం? వివాహకాంక్షా భరాక్రాంత దుర్దాంత దురంతసంతాప పరితప్యమాన స్వాంతలరగు నోకాంతలారా!

ఏల దిగులు జెంద,
మేలు మిమ్ముఁబొంద,
కాలునిపురి నొంద.
వాలునిదే — గిరగిరన్, ద్రిప్పెదన్, చంపెదన్.

(కత్తి త్రిప్పుతున్నది)

అంబిక: ఏమే, అంబా! దూరంగాపోయితిప్పు. మాకుతగులుతుంది.

అంబ: "సుందరులారా, నే నంబను కాను. కావలసిన నన్ను శిఖండీ యని పిలువుఁడు. నాయెడఁ జనవునఁ బ్రవర్తింప వలెనని యున్నచో "ముండిశిఖండీ" యని పిలిచినను గౌరవాహ్వానముగా నే తలంతును. భవద్దాసుండ. నన్నేని పంచినను చతురంబోధిపరీతభూవలయంబున నెద్దిగోరిన దాని నవలీలంగొని సమర్పింపంగలవాఁడను. మీయపాంగావలోకన ప్రసారములే యీదాసుఁడు కోరు ప్రతిఫలము."

అంబాలిక: వెర్రికుదిరినది, రోకలి తలకుచుట్టుమన్నట్లున్నది. అంబికా ఈముండి మసలను పెండ్లాడుతుంది కాబోలునే.

అంబిక: కానీ, ఈవాలకమేమిటో చూదాము.

అంబ: "పడతులారా! చూచితిరే యౌవనసౌభాగ్యము!"

అంబిక: ఇది వనముకాదు, అంతఃపురము.

అంబ: "ఇది యౌవనసౌభాగ్యముతోఁ దులదూఁగుచున్నది. ఈ పద్మాకరంబులు..."

అంబాలిక: ఇక్కడ పద్మాకరాలులేవు.

అంబ: ఛఫ్, నాటకాలలో ఉంటాయి. "ఈపద్మాకరంబుల నుండి వెలువడు సౌరభములకు మోహపడి యీనుదుటిపై చల్లనిపిల్లగాలులకెలయు నయ్యవి భృంగములా? యీముం గురులా? అయ్యారే, అయందము, వెయ్యారులుచేయు. భళిరా, (అంబికనుచూపి) యిది విరహులపాలి దంభోళిరా. (అంబాలిక వంకచూపి) ఇది కాముకులపాలి పానకము రా! ఆహా, మదనా, నాతో కదనము సేయనెంచితివా? నామనసునకు నేనీశ్వరుడనని నీకు తెలియదేమో. జాగ్రత్త!"

(నేపథ్యమున కలకలము)

అంబిక: అంబాలికా, పోయిచూడు, అదేమిటో!

అంబాలిక: (పోయివచ్చి)నాయనగారు స్వయంవరము చాటిస్తున్నారు.

అంబ: ఏమని చాటిస్తున్నారు?

అంబాలిక: యుద్ధములో మనల నెవరు గెలుచుకొంటే వారికిచ్చి పెండ్లిచేస్తానని.

అంబ: 'మనల్ని గెలుచుకొంటే' అంటే. మనతో యుద్ధముచేశా! దానికి నేను సిద్ధమే. రమ్మను.

అంబిక: మనతో కాదే. వాళ్ళలో వాళ్ళు.

అంబ: నాన్నకు బుద్ధి లేదు. వాళ్ళలోవాళ్ళు యుద్ధముచేసుకొని చస్తే, అపీనుగులను మన మెందుకు పెళ్లిచేసుకోవాలి?

అంబిక: అట్టి వివాహానికి రాక్షసవివాహమంటారు. అది క్షత్రియులకు ధర్మమయినదే.

అంబ: వీళ్లూసరే, వీళ్లక్షాత్రమూసరే. క్షత్రియులట! ఇప్పుడు క్షత్రియు లెక్కడున్నారు? క్షత్రియుల నానాడే కడ తేర్చాడు పరశురాముడు. ఇప్పుడంతా మాలకూడు; మంగలకూడు.

అంబాలిక: అంబా, గట్టిగా కేక లెయ్యకు. ఎవరైనా వినిపోతారు.

అంబ: వింటే విననీ, నాకేమిభయం? ఉన్నమాటంటే ఉడుకు

బోతుతనం. స్వయంవరమట, వీళ్ళ శ్రాద్ధం.

అంబిక: నోరు మూసుకోవే, అమ్మా, బతిమాలుకొంటాను.

అంబ: సిగ్గు లేకపోతే, మీరుపోండి మీయిష్టమువచ్చినవాళ్ళతో. నేను స్వయంగా వరిస్తే స్వయంవరమా, ఎవడో బలవంతముగా ఎత్తుకపోతే స్వయంవరమా? నేనయి ఈస్వయంవరాని కొప్పుకోను. అంత ప్రాణంమీదికి వస్తే, ఈ కత్తితో మెడకోసుకొని చస్తానుగాని —

అంబాలిక: అదేమే? గెలిచినవాడు అందమైనవాడు, ఉత్తమకులమువాడు, బలవంతుడు, మహారాజు, అయినా నీకిష్టములేదా?

అంబ: అందగాడైనా, కురూపిఅయినా, ఎక్కువ కులమువాడయినా, తక్కువకులమువాడయినా, బలవంతుడయినా, బలహీనుడయినా, మహారాజయినా, గంజిత్రాగేవాడయినా, నేనుకోరాలి; నేను చేపట్టాలి, నేను వానింటికిపోవాలి అప్పుడేస్వయంవరం, లేకపోతే పరంపదమే.

అంబిక: పరంపదం మంచిదేకదా?

అంబ: మంచిదైతే నీవుపో పరంపదానికి. నేనురాను.

మీ ముగ్గురున్ను ఒక్కయింటి కోడళ్ళయి, ఒక్కనికి భార్యలై, అన్యోన్యంగా ఉండి సుఖసంసారము చేస్తూ ఉంటే చూడవలెనని ఉంది.

అంబిక: ఇంతసేపూ మేము స్వయంవరంమాటే అనుకొంటూన్నాము నాన్నా!

కాశీరాజు: అమ్మా, క్షత్రియులకు గాంధర్వము, రాక్షసము, అనే రెండువిధాల వివాహాలు విధింపబడ్డాయి. గాంధర్వములో ఇద్దరున్ను ఒకరినొకరు ప్రేమించుకొని తామే పెండ్లి చేసుకొంటారు.

అంబాలిక: అయితే అదే బాగుందే?

కాశీరాజు: అదిమంచిదేకాని, అట్టిప్రేమ తాత్కాలిక ప్రేమో, గాఢప్రేమో, తెలుసుకొనడానికి వీలులేదు. నేడు పెండ్లాడినవారు రేపు విడిపోతే ఆడదానికి గత్యంతరము లేదు. మగవానికేమి? ఆడది నవ్వులపాలవుతుంది.

అంబిక: రాక్షసవివాహ మెటువంటిది?

కాశీరాజు: దానిప్రకారము బలవంతు లొకరిలో ఒకరు యుద్ధముచేసి,

వారిలో తక్కినవారి నందరినీ ఓడించ గలిగినవాడు కన్యకను తీసుకపోతాడు.

అంబాలిక: అయితే, కన్యక ఇష్టపడనక్కరలేదూ?

కాశీరాజు: ఇష్టపడడాని కేముంది. బలవంతుడైనవానిని కన్యక వరించక పోవడ ముంటుందా?

అంబిక: ఏమో, యుద్ధములో జయాపజయములు దైవాధీనములు గదా! అందరికంటే బలవంతుడే గెలుస్తాడ నేముంది?

కాశీరాజు: అట్లాగయినా; గెలిచినవాని ప్రక్క దైవబలమున్నదని అనుకోవాలిగదా.

అంబ: (ముసుగులో నుంచి) ఆ గెలిచినవాడు వయస్సు మీరిన వాడయితే? వాడు బూచిలాగుంటే?

కాశీరాజు: (ఉలికిపడి) ఎవరామాట్లాడినదీ?

అంబిక: ఎవరూలేరు. మన అంబే.

కాశీరాజు: అమ్మా, అంబా, తలనొప్పిట్లాఉన్నదమ్మా. అదేమిటె, ఆమూల ఉత్తనేలమీద పండుకొన్నావు? (లేచి ఆమె

వద్దకు పోతూ) మంచమూ, పరుపూ, వేయించలేక పోయినావమ్మా, అంబికా ?

అంబాలిక: నాన్నా, అంబవద్దకు వెళ్ళవద్దు. దగ్గరకెవ్వరినీ రానివ్వవద్దని చెప్పింది నాతో.

కాశీరాజు: ఏమీ !

అంబాలిక: హస్తినాపురమునుంచి ఎవడో వైద్యుడు తలనొప్పిమందు తెచ్చియిచ్చాడు. అది రాసుకొంటే, అసలు తలనొప్పిమాట దేవుడెరుగునుగాని, మంటమంట ఎక్కువయిందట. గాలితగులుతే మంట ఎక్కువవుతుంది. అంబ ముసుగుతీస్తే బాధ భరించలేదు.

కాశీరాజు: పాప మంతబాధగా ఉందా ? మందు తుడిచివేసుకోలేక పోయిందా ? నేనయినా తుడిచేస్తాను. (అని అంబ దగ్గరకు పోతాడు. అంబ మరింత బిర్రుగా ముసుగు బిగిస్తుంది.) ఏదమ్మా, అంబా!

అంబ: (మూలుగుతూ) వద్దునాన్నా ! నేను తుడిచేసుకొన్నానూ! అయినా, మంట తగ్గకుండా ఉందీ ! ముసుగు తియ్యకు నాన్నా !

కాశీరాజు: భయములేదమ్మా; ముసుగుతియ్యి. మంత్రమైనా వేస్తాను.

అంబ: మంత్రానికిలొంగను నాన్నా, బాధా! నీకిష్టముంటే ముసుగు మీదినుంచే వెయ్యి.

(అంబిక, అంబాలిక, ఒకరినొకరు చూచుకొని నవ్వుకొంటారు)

కాశీరాజు: ఏమమ్మా, నవ్వుతారు? బిడ్డ కెంతబాధగా ఉందో! అమ్మా, నామాట విను, ఒక్కసారి ముసుగు తియ్యి. ఒక్క క్షణములో బాధపోయేటట్లు చేస్తాను.

అంబ: అబ్బా, వద్దునాన్నా.!

అంబిక: అంబా, చెప్పేదునా?

అంబ: ఏమిటి చెప్పుతావు, నీ మొగము?

అంబాలిక: నాన్నా, దీనిలో ఒక కిటుకుంది.

కాశీరాజు: అమ్మా, అంబా! ఇదా! కొంటెచేష్టలుమాని ముసుగు తియ్యి (అని తియ్యబోతున్నాడు).

అంబిక: తీసియ్యవే, అంబా, భయమేమిటి? నాటకంవేషమే కదూ?

కాశీరాజు: నాటకమేమిటమ్మా!

అంబిక: ఏమీలేదు. ఇంతసేపూ మేము నాటక మాడుకొంటున్నాములే.

కాశీరాజు: ఓస్, దీనికేనా? ఏదమ్మా, అంబా, నీవేషము చూడ నియ్యవూ?

అంబ: (ముసుగుతీసి నిలబడి) ఇదిగో నాన్నా! సరా?

(అందరూ నవ్వుతారు. అంబకూడా నవ్వుతుంది.)

కాశీరాజు: ఓసే పిచ్చిపిల్లా! మగవేషం వేసినావా?

అంబిక: నీకు తెలియదుగాని, నాన్నా, మన అంబ మగపాత్రం ఎంతబాగా అభినయిస్తుం దనుకొన్నావు?

కాశీరాజు: ఆఁ, అలాగేమి? నేనెప్పుడూ చూడలేదు. ముందుముందు ఆ నేర్పు బాగాపనికివస్తుందిలే. అమ్మా, అంబా, స్వయం వరం చాటించాను. రాజు లొక్కొక్కరే వస్తున్నారు. వారిలోవారు యుద్ధముచేసుకొని, వారిలో మిక్కిలి బలవంతుడైనవాడు మిమ్మల్ని ముగ్గురిని తనయింటికి తీసుకొని పోతాడు. తిరిగీ మిమ్మల్ని నాకు చూపిస్తాడో లేదో. అమ్మా, ముగ్గురున్నూ కలసిమెలసి ఉండండేం! ఒకరివల్ల తప్పుంటే, తక్కినవాళ్ళు సర్దేస్తూ ఉండండేం! నన్నప్పుడప్పుడు తలుస్తూఉండండీ. కన్నాను, పెంచాను. ఆడపిల్ల లెన్నటికయినా పరాధీనమే కదా!

(కన్నీరు విడుస్తాడు.)

అంబ: ఏమి నాన్నా, అంత గ్రహచారం? ఆడపిల్ల పరాధీనము, మగవాడు స్వాధీనమూనా? ఎవరు చేసిన గీయేర్పాటు? ఆడదానికి బలము లేదనా, ఇట్లా ఏర్పాట్లు చేశారు? బలము గల ఆడదయితే?

కాశీరాజు: అట్లా అనకూడదమ్మా!

అంబ: అనకూడదేమి? ఆడది బానిసయేమి? దానికి ముకుదాళ్ళుకట్టి ఈడ్చుకపోవడానికి పశువేమి? మగవాడే బుద్ధిమంతుడా? ఆడదానికి దేవుడు బుద్ధియివ్వలేదూ? ఏమిమాటలివి?

కాశీరాజు: ఆచారాన్ని అతిక్రమించరాదమ్మా! పొండి, స్వయంవరానికి సిద్ధముకొండి. అంబా, అమీసాలు తీసేసుకో అమ్మా! బుద్ధిగా ఉండు. చెల్లెళ్ళమాట విను. అదిగో రాజులు యుద్ధానికిఆరంభించారు. అమ్మా పోయివత్తునా?

అంబిక: పోయిరా నాన్నా. (కాశీరాజు నిష్క్రమించినాడు.)

అంబాలిక: రావే, అంబా, పోదాము. (అని అంబను చేయిపట్టు-కొని తీసుకొని పోతున్నది. అంబిక వారివెంటనే పోతున్నది.) (తెర)

# ద్వితీయాంకము.

## రంగము ౧.

(సాళ్వరాజుశిబిరము. శిబిరము వెలుపలబయలు. కారుమేఘములు, ఉరుములు, మెరుపులు, రెండు పిశాచములు, తలనిండా కాళ్ళవరకు నల్లనిముసుగు.)

మొదటిది: ఏమి మారమ్మా, ఏమయినా చిక్కాయా?

రెండోది: ఇప్పటివరకూ ఏమీచిక్కలేదు.

మొదటిది: ఏమిచెప్పమా. యుద్ధమవుతుందనీ, కడుపు నిండుతుందనీ, బయలుదేరి ఎంతో ఉత్సాహముతో వస్తే, ఎవ్వడూ యుద్ధముచేసేవాడే కనబడడు.

రెండోది: ఎవడో భీష్ముడట, వచ్చినాడట. అతడు శంఖము ఊదితేసరి, గుండెలలో దడ, కాళ్ళవడకు. అతని రథము దగ్గరకు వస్తున్నదనేసరికి, రాజులూ గీజులూ, అందరూ ఒకటే ఉరుకు. ఇల్లుచేరేవరకు తిరిగిచూస్తే తిమ్మన్నతోడు. ఇళ్లలో గొట్టాలమ్మ వారికోసం ఎదురుచూస్తూఉన్నాదట.

ఆయమ్మకుకూడా అట్టే ఉత్సాహం కలుగనియ్యకుండా వైద్యాలు తగులుకొన్నారట.

మొదటిది: అయితే జననష్టం ఏమీకలుగలేదన్న మాటే.

రెండోది: ఇప్పటికి కలుగలేదు. ఈ భీష్ముడికి ఎదురు నిలువగలిగిన వాడెవడైనా ఉంటేనేకాని, మన మిక్కుడికివచ్చినదానికి ఫలం కలుగదు.

మొదటిది: నీకు తెలిసినంత మట్టుకు అట్టివాడెవడైనా ఉన్నాడా ?

రెండోది: ఉన్నాడుగాని, ఇంతమంది పారిపోతూవుంటే, అతడు మాత్రం నిలుస్తాడని ఏమిచెప్పగలము ?

మొదటిది: ఎవరాయన ?

రెండోది: సాళ్వరాజు. ఈ శిబిరమాయనదే.

మొదటిది: అట్లాగేమి ? నీవు బుద్ధిమంతురాలవు గదా. అతడు యుద్ధముచేసే ఉపాయమొకటి ఆలోచించకూడదూ ?

రెండోది: అదే ఆలోచిస్తున్నాను. ఈయనకు కాశీరాజు పెద్ద కూతురు అంబమీద మోహమట. తక్కిన యిద్దరు

కూతుళ్లమీద అతనికి లేదుగాని, అంబని పెళ్లాడవలెనని చాలా ఉన్నదని అనుకొంటారు.

మొదటిది: అంబకు అతనిమీద ఉన్నదా?

రెండోది: ఉన్నదనే అనుకొంటారు. కాని, ఆమె మనస్సు కనుక్కోవడ మేలాగు? ఆమెకు సాళ్వరాజుమీద ప్రేమ ఉంటే ఏదో ఒక ఉపాయ మాలోచించ వచ్చును.

మొదటిది: ఉండకుండా ఉంటుందా? అయితే, వారిద్దరూ ఈమధ్య ఎప్పుడయినా ఒకరినొకరు చూచుకొన్నారా?

రెండోది: లేదు; వారిద్దరికీ సమావేశం కల్పిస్తే మన పుణ్యం పుచ్చవచ్చు.

మొదటిది: నువ్వు సమావేశం కల్పించలేవూ?

రెండోది: కల్పిస్తానుగాని, నువ్వు నాకు సహాయం చెయ్యాలి.

మొదటిది: ఏమి చెయ్యమంటావు?

రెండోది: ఏమీ అంతకష్టమైన పనికాదు. సాళ్వరాజు గుడారం వద్ద పహరా వాడుంటాడు. నువ్వు ఒక సైనికుని వేషం

వేసుకొని, పహారామారేటప్పుడు నీవే వానికిబదులుగా అక్కడ కాచుకొని ఉండు. పహారామారడానికి ఎవడయినావస్తే, నీ నిజరూపం చూపించి పారిపోయే టట్టు చెయ్యి. నేను అంబను మాయకల్పించి తీసుకొని వస్తాను. అప్పుడు నువ్వు మాకెదురుగావచ్చి, అంబను మర్యాదచేసి, రాజావారు తమకోసం నిరీక్షించుకొని ఉన్నారని, లోపలికివిడిచిపెట్టు.

మొదటిది: ఎత్తువేస్తే అట్లాచెయ్యాలి. నువ్వువేగంపోయి అంబను తీసుకొనిరా. నాప్రయత్నంలో నేనుంటాను.

(ఇద్దరున్ను పోతారు.)

## రంగము ౨.

[ఆదేరాత్రి అంబ అంతఃపురము. దీపము తగ్గగా వెలుగుతూ ఉన్నది. అంబ తనపరుపుమీద కూర్చొనిఉన్నది]

అంబ: (తనలో) ఆహా, అంబికాంబాలికలు ఎంతగాఢంగా నిద్రపోతున్నారు! వాళ్ళకు చీమచిటుక్కుమన్నట్లన్నా లేదు. "రేపెవడో వస్తాడు! మనల్ని తీసుకొనిపోయి పెండ్లి చేసుకొంటాడు. వానితో కాపురముచేస్తాము"

— అనేకాని, పెండ్లిఅంటే ఏమిటో, అలుమగల సంబంధ మెట్టిదో, గృహములోను సంఘములోను ఆడదాని కుండవలసిన స్థానమేమిటో, ఈవిషయమైవారి కాలోచనే లేదు. నాప్రకృతివేరు ; ఎవడోవచ్చి తీసుకపోతే పోవడమేనా ? ఏమి అన్యాయము ? అవును, ఆచారము, శిష్టాచారము. సంఘాచారము, లోకము దాని ననుసరిస్తుంది. తాతలనుచూచి తండ్రులు, తండ్రులనుచూచి వారి సంతతివారు. ఆచార మనుసరణీయమా, కాదా ? అనుసరణీయమే— వ్యక్తిస్వాతంత్ర్యమును నిరోధించ నంతమట్టుకు. నేనొక వ్యక్తినికానా ? నాకు కష్టసుఖములు లేవా ? నా కిచ్ఛాద్వేషములు లేవా ?

[ ఒక దేవదూత ప్రవేశము, ఆపాదమస్తకము తెల్లనిముసుగు ]

దేవదూత: ఎందుకులేవు ? ఉన్నవి.

అంబ: ఇదేమిటి ?...ఎవరావస్తున్నది ?...ఎవరునాకు ప్రత్యుత్తర మిచ్చినది ?...ఈ అర్ధరాత్రమప్పుడు — (మంచము మీది నుంచి లేస్తూ) ఎవరా ముసుగులోనున్నది ?... ఈనిసివేళ ...ఈ అంతఃపురములోనికి ఎందుకుజొరబడ్డావు ?

దేవదూత: నీ కిచ్ఛాద్వేషములున్నవని స్మరణకు తేవడానికి.

అంబ: నాయిచ్ఛాద్వేషములతో నీకేమిపని ? నీవెవరు ?

దేవదూత: అంబా, భయపడకు. నేను దేవదూతను. నీ యిచ్ఛా ద్వేషములమూలమున ఒకదేవకార్యము కావలసిఉన్నది.

అంబ: ఏమీ, దేవకార్యమా ? చెసేదానను నేనా ? నరులు దేవతలకు సహాయము చేసేవారా ?

దేవదూత: చేయలేకేమి ? చేయగలిగినపనినే చేయవచ్చును.

అంబ: ఆడది దేవతలకోసము సాధింపదగిన కార్యాలుకూడా ఉంటాయా ?

దేవదూత: అంబా, నీవు సామాన్య స్త్రీవి కావు. దేవాంశసంభూతవు. దేవతాకార్యము కొరకు పుట్టినావు.

అంబ: ఏమి ?

దేవదూత: నీ వాశ్చర్యపడనక్కరలేదు. నెను చెప్పినది నిజము.

అంబ: అయితే నేను చేయవలసినపని యేమిటి ?

దేవదూత: అది ఒకపుణ్యకార్యము. ఘనకార్యము. దేవతలకు ప్రీతికరమైన కార్యము.

అంబ: అయితే, ఆపని చేయడానికి సంసిద్ధురాలనుగా ఉన్నాను. దేవతల ఆజ్ఞను తెలుపవచ్చును.

దేవదూత: దేవతలు కృతార్థులయినారు. అంబా భీష్ముడనే మహా-నుభావుని పేరు విన్నావుకదా.

అంబ: విన్నాను. అయన తండ్రిసౌఖ్యముకోసము రాజ్యాధికారము వదలిపెట్టడమేకాకుండా, తనకు సంతతి లేకుండా ఉండడానికి పెండ్లి చేసుకోననికూడా దీక్ష-పూనినాడట.

దేవదూత: అవును. అతనిని చంపడానికి నీవు పుట్టినావు. ఆపనిని చేయడానికి నీకు ధృఢసంకల్పము కల్పించడానికి దేవతలు నన్ను నీవద్దకు పంపినారు.

అంబ: ఏమిది? భీష్ముడు మహానుభావుడని నీవేకదా పలికినది అట్టి వానిని నేను చంపవలెనా? దేవతలకు అతనిమీద అంత ఈర్ష్య ఎందుకు? నన్నీపనిచేయమని దేవతలు కోరడము భావ్యమా?

దేవదూత: అంబా, ఈలోకతంత్రము సామాన్యమానవులకు దురూహ్యము. దేవతలు కూడా మనుష్యుల వంటివారే.

వారున్ను తప్పులు చేస్తూఉంటారు. శాపగ్రస్తులై భూమిమీద అవతరిస్తూ ఉంటారు. ఇది దైవలీల— భూభారమును తొలగించడానికి శాపమనేమిషతో దేవతలను ఈశ్వరుడు భూమిమీద పుట్టేటట్లు చేస్తాడు.

అంబ: నీమాటలు నాకు బోధపడలేదు.

దేవదూత: బోధపడడానికేముంది ? భీష్ముడుకూడా ఒక దేవత. శాపవశము చేత దేవతలకార్యముకోసము భూమిమీద పుట్టినాడు. అతని శాపాంతము నీమూలముగా కలుగవలెనని దైవనిర్ణయము.

అంబ: అయితే, భీష్ముడు చేయవలసిన దేవతాకార్యము నెఱవేరినదా ?

దేవదూత: ఇంకా లేదు. కొద్దికాలములో నెరవేర బోతుంది. నెరవేరగానే నీపని పడుతుంది.

అంబ: దానికోసం ఇప్పటినుంచీ నేనుచేయవలసిన దేముంది ?

దేవదూత: ఆపనిచేయడానికి నీవు శక్తిని సంపాదించాలి. అతడు సామాన్యుడుకాడు.

అంబ: అయితే నన్నేమిచేయమంటావు ?

దేవదూత: రేపు భీష్ముడు రాజులనందరినీ గెలిచి నిన్ను నీచెల్లెళ్ళను తీసుకపోవడానికి వస్తాడు.

అంబ: బ్రిహ్మచారికి నాతో ఏమిపని ఉంటుంది ?

దేవదూత: మిమ్మలిని పెళ్లిచేసుకోవడం అతనిఉద్దేశంకాదు,తనతమ్ముడు విచిత్రివీర్యునికి మిమ్మలిని కట్టిపెట్టవలెనని అతనితలంపు.

అంబ: అదెన్నటికిన్ని కుదరదు.

దేవదూత: అదృఢసంకల్పమే నీకు కొనవరకూ ఉండాలి.

అంబ: ఈమాట చెప్పడానికి దేవతలు నిన్నిక్కడికి పంపి వృధా శ్రమఇచ్చినారు.

దేవదూత: నీమనసు సాళ్వరాజుమీద ఉన్నది.

అంబ: నీవెట్లు తెలుసుకొన్నావు ?

దేవదూత: దేవతలకు తెలియని దేముంటుంది !

అంబ: అయితే సాళ్వరాజును పెండ్లిచేసుకొనడానికి దేవతలు సహాయముచేస్తారా ?

దేవదూత: చేసేటట్లు లేదు.

అంబ: ఏమీ? దేవతలు తమ కార్యం చేయించుకొనడానికి ఇదా వారు నాకుచేసే ప్రత్యుపకారము? చాలు, చాలు, నేను సాళ్వరాజునే పెండ్లాడుతాను. నాశక్తి నాకుచాలును. దేవతల సాయమక్కరలేదు.

దేవదూత: అది నీయిష్టము.

అంబ: విధినిర్ణీతమైనవిషయమును నీవు నాకు తెలుపుటవల్ల ఏమి ప్రయోజనము?

దేవదూత: ప్రయోజనముండబట్టే వచ్చినాను. నేనింక ఇక్కడ ఉండకూడదు. పోతాను. (పోతున్నాడు.)

అంబ: ఇది ఒకదివ్యదర్శనము. నాఊహాప్రపంచములోని ఒక దృశ్యము. నామనస్సులోని కలవరపాటు బహిర్గతమై చక్షుర్గోచరమైనది. దేవతలేమి? మనుష్యులకు కనబడడమేమి?... సాళ్వరాజును పెండ్లిచేసుకొనడానికి దేవతలు సహాయముచేయరా? వారితో నాకేమిపని? నేను సాధించుకోలేనప్పుడుగదా వారిసహాయము కోరేది!

[ప్రవేశము: రెండో పిశాచము దూతిక వేషముతో.]

అంబ: ఇదేమి, మరొక్క దర్శనము! నీవెవరు?

దూతిక: (మాట్లాడదు. రమ్మని చేసైగ చేస్తున్నది.)

అంబ: ఎవరునీవు? మాట్లాడవేమి? ఎక్కడికి రమ్మంటావు?

దూతిక: (వెనుకకు తలుపుదగ్గరకుపోయి బయటికి చూపుతున్నది.)

అంబ: ఈ అర్ధరాత్రివేళ బయటికిరావలెనా! అంతఃపుర రక్షకులు పోనిస్తారా?

దూతిక: (ఎవ్వరూలేరని సైగచేస్తున్నది.)

అంబ: ఎవ్వరూలేరూ? ఎక్కడికి పోయినారు?

దూతిక: (నిద్రపోతున్నారని సైగచేస్తున్నది.)

అంబ: నేను రావడమెందుకు?

దూతిక: ('వడిగా రా' అని సైగచేస్తున్నది.)

అంబ: నీవేమి పిశాచమవా? దేవతవా? నన్నెక్కడికి తీసుకపోతావు?

దూతిక: (భయపడక రమ్మంటున్నది.)

అంబ: ఇదంతా విచిత్రంగా ఉంది. నాకిప్పుడు వశము తప్పిపో తున్నది. నేనెవ్వరు ?... నేను నేను కానా ? ఇది కలయా ?... (గిల్లుకొని చూస్తున్నది.) నొప్పి ఉన్నదే! 'పో, పో.' అనిలోపలినుంచి ఏదో తొందరపెట్టుతున్నది. ఇంతకుముందువచ్చిన దేవదూత ఈవేషముతో వచ్చాడా ?— అమ్మా, నీవెవరు ?... నీతో రాకతప్పదా ? నాకుదారి తెలియదే. ఈచీకటిలో దారే కనబడదే.

మాతిక: (నేనుచూపుతానని సైగ చేస్తున్నది.)

అంబ: ఏమో, నాలోనుండి ఎవరో గెంటుకొని పోతున్నట్లువు తున్నది. ఈవిచిత్రంకూడా చూస్తాను. పద, దారి చూపు, వస్తాను.

(మాతిక దారిచూపగా అంబ నిష్క్రమిస్తున్నది.)

## రంగము 3.

[ సాళ్వరాజు కూర్చున్నాడు. అంబ ప్రవేశిస్తున్నది. ]

సాళ్వరాజు: ఎవరది ?

అంబ: నేను.

సాళ్వ: నేనంటే ?

అంబ: నిన్నుకోరి వచ్చినాను.

సాళ్వ: నాకుబోధపడలేదు. నీవీ యుద్ధరంగదేవతవా ? కామినీ-పిశాచమవా ?

అంబ: ఎట్లనుకొంటే అట్లే అనుకోవచ్చును.

సాళ్వ: నీమాటలు చిత్రముగా ఉన్నవి. నిన్నెప్పుడో చూచినట్లున్నది.

అంబ: అవును, చూచినావు. చాలాకాల మైనది. తరుణము చూచుకొని నన్ను తీసుకొనిపోతానని వాగ్దానము చేసినావు. తరుణము వచ్చినది. బయలుదేరుదామా ?

సాళ్వ: ఎవరూ ? అంబా !

అంబ: అవును, నేనే.

సాళ్వ: అంబా, ఏమి నీ ధైర్యము ? ఏమి నీసాహసము ? ఈకాళరాత్రిలో, ఈచిమ్మచీకటిలో, పంచభూతముల కోపమును లక్ష్యపెట్టక, ఒంటరిగా,—

అంబ: ప్రేమ గుడ్డిది.

సాళ్వ: కులకన్యవుకదా ?

అంబ: అయితే ?

సాళ్వ: అంతఃపురరక్షకులు లేరా ?

అంబ: ఉంటేనేమి ?

సాళ్వ: నీకు దారి ఎట్లు తెలిసింది ?

అంబ: ఎవరో చూపినారు ? సిద్ధమా ?

సాళ్వ: అంబా, నీసాహసము మెచ్చుకోదగినదే. నాయెడ నీకుగల ప్రేమ విస్పష్టమయినది. కాని —

అంబ: కాని యేమిటి ? ఏమయినా ఆటంకములున్నవా ?

సాళ్వ: నా పౌరుషమే ఆటంకము. నీకుకలుగబోయే అపనిందే ఆటంకము.

అంబ: నా అపనిందమాట ఆలోచించనక్కరలేదు. మీ పౌరుషముమాట ఆలోచించుకోవలసినదే.

సాళ్వ: రేపు సాళ్వభీష్ములకు యుద్ధముజరుగుతుందని లోక మంతా అనుకొంటున్నారు. నాసహాయముకోసము పారిపోయిన రాజులందరూ తిరిగీ వస్తున్నారు. ఇట్టి సందర్భములో మనమిప్పుడు లేచిపోతే, సాళ్వరాజు దొంగతనముగా అంబ నెత్తుకొనిపోయినాడని నవ్వుతారు. మీనాయనచాటించిన స్వయంవరము మీఅక్క చెల్లెళ్లు ముగ్గురి కోసమున్ను కాని నీఒక్కతెకోసమేకాదు. గెలుస్తే ముగ్గురిని తీసుకపోవలెను. నిన్నొక్కతెనే ఈ రాత్రివేళ ఇతరులకు తెలియకుండా తీసుకొని పోవడము పౌరుషమార్గముకాదు.

అంబ: అయితే తాము భీష్ముని గెలువగలరా!

సాళ్వ: భీష్ముడు సామాన్యుడుకాడు. అతనిపేరు విన్నంతనే రాజులకుభయము. నాకుమాత్రము భయము లేదు. 'సాహసేలక్ష్మీః' అన్నారు. ఎదురునిలిచి నిండుశక్తిని ప్రయోగిస్తే భీష్ముని జయింపవచ్చును.

అంబ: ఇంతేనా పౌరుషము? 'జయింపవచ్చును' అంటే ఆత్మశక్తినిగురించి సందేహించినట్టేకదా? సందేహముతో కార్యారంభము చేసేవానికి జయముకూడా సందేహమే.

సాళ్వ: నాకు సంభ్రమామనికాదు. కాని, ఎదిరిబలము నాలోచింపక త్వరపడరాదుగదా.

అంబ: అయితే యుద్ధమయినతరువాతే మనకు పునస్సమావేశము?

సాళ్వ: నేను గెలిస్తే.

అంబ: గెలువకపోతే?

సాళ్వ: నీవు భీష్ముని అధీనములో ఉంటావు.

అంబ: నీవోడిపోతే మనము మరి కలియనక్కరలేదన్నమాటే?

సాళ్వ: అవును.

అంబ: నీవోడిపోయినా నిన్నే నేను ప్రేమిస్తే?

సాళ్వ: నేనేమి చేయగలను?

అంబ: ఇంతేనా? చిన్ననాడే నీవిట్టివాడవని తెలుస్తే మరి ఒక దారి చూచుకొందునే! భీష్ముడు బ్రహ్మచారి. నన్ను పెండ్లాడడు. గెలుస్తే నన్నుతీసుకొనిపోయి పనికిమాలిన తన తమ్ముడికి ముడిపెడతాడు. నేను విచిత్రవీర్యుని పెండ్లామునై ఉండడమేనా?

సాళ్వ: అది నీయిష్టము.

అంబ: చాలు చాలు. తెగించి నీయెదుటబడినందుకు తగిన శాస్తి అయినది. ఇట్టిమాట లాడతావని నేననుకోలేదు. భీష్మునితో యుద్ధముకూడా ఎందుకుచేయడము ? తెల్లవారకమునుపు నీకాళ్ళకు బుద్ధిచెప్పకో.

సాళ్వ: అంబా, నీ వంతనిష్ఠూరముగా మాట్లాడనక్కరలేదు. క్షాత్త్రధర్మమునుగురించి చెప్పినాను, అంతే. నీవాడిన మాటలను తలచుకొని రేపు భీష్ముని జయించి, నీచెల్లెళ్ళతో నిన్ను రథముపై నెక్కించుకొని తీసుకపోతాను. ఓపికపట్టి ఉండు.

అంబ: మీరు భీష్ముని సాధించలేకపోతే, ఆడదానిని నేనయినా సాధించగలను లెండి. నన్ను సారథిగా చేసుకొంటే మీకు జయ మవలీలగా కలుగుతుంది.

సాళ్వ: నీవుకూడా యుద్ధముచేస్తావా ?

అంబ: నేను యుద్ధము చేయనక్కరలేదు. నా మొగము చూడగానే భీష్ముడు మరలిపోతాడు.

సాళ్వ: ఎట్లు ?

అంబ: భీష్ముడు ఆడదానిమొగము చూడడని వినికి. ఇది ఒకటి. నేనంతకుముందే మీవశమం దుండడముచూచి, తాను నాకోసము పరిప్రయత్నము చేయడు. ఇదిరెండు.

సాళ్వ: నీవు చెప్పినది యుక్తియుక్తముగానే ఉన్నదిగాని, రాజులు నన్నేమంటారు ?

అంబ: అది మీరుచూచుకోవలసినది.

సాళ్వ: అంబా, నీవుచెప్పినమార్గము బాగులేదు. అది నాగౌరవమునకు, నాపౌరుషమునకు కళంకముకలుగజేస్తుంది.

అంబ: అయితే నీయిష్టము. నేను పోమనా ? తెల్లవారవస్తున్నది. అంతఃపురములో చేరుకొంటాను. మగతనముంటే భీష్ముని గెలిచేది; లేకపోతే,—

సాళ్వ: అంబా, నన్ను మాటలతో పొడువవద్దు.

అంబ: మాటలేల ? ఇదిగో కత్తి. ఇవిగో అమ్ములు, విల్లు. మీకివి నేనిచ్చినవి. నన్ను మనసులో ఉంచుకొని వీటితో యుద్ధము చేస్తారా ?

సాళ్వ: సరే.

అంబ: గెలిచినంతవరకు, ప్రాణము ఉన్నంతవరకు, యుద్ధము చేస్తారా?

సాళ్వ: చేస్తాను.

అంబ: మీజయముకోసము ఈప్రేయసి హృదయము బిగబట్టుకొని నిరీక్షిస్తూ ఉంటుంది. పోతున్నాను.

(నిష్క్రమించును.)

సాళ్వ: ఏమి ఈఅంబసాహసము? దీనియెదుట నేను నోరే యెత్తలేకపోతినె! కాని, ఈమెకు నాచకన్నె చిన్నెలే లేవు. ఈమెకోసమా యుద్ధముచేయడము? మర్యాదగా మాటలాడడమే ఎరుగదు. అన్నీ మగచేష్టలే. ఏమిది నాఅవస్థ? ఈమెపై నాకు ప్రేమపుట్టలేదు. గెలుస్తే ఈమెను భార్యగాచేసుకొని అవమానము. గెలువకపోతే, పరాజయమువల్ల అవమానము. ఈమెకోసము కాకపోయినా, తక్కిన యిద్దరికోసమయినా యుద్ధముచేయక తీరదు.

(తెర)

---

# తృతీయాంకము.

## రంగము ౧.

[తెరలో]

ఓహో రాజులారా, భయపడకండి. పదుగురము కలిసి పోరాడితే, ఒక్క భీష్ముడేమిచేయగలడు? తలా ఒకదిక్కు చెదిరి పోతే కార్యము లేదు. అదిగో ఆతడు కన్యకలను రథముమీద పెట్టుకొని వడిగా తోలుకొనిపోతున్నాడు. ఇంతలో మనకు దూరముగా పోగలడు. తనవారిని చేరినతరువాత అతనిని గెలవడముకష్టము. రండి, రండి.

[ప్రవేశము: ఇద్దరు సైనికులు.]

మొదటి: ఔరా, ఎంతమాయగాడు, భీష్ముడు! చిల్లరరాజులను ముందుగా జయించి, కాశీరాజుకోటలో జొరబడినాడు. ఆముసలిరాజు భయపడి కూతుళ్లను తెచ్చి ఒప్పచెప్పినాడట.

రెండో: పెద్దరాజులు మొదటనే ఎందుకెదిరించారుకారు?

మొదటి: మనరాజులలో ఉన్న తెగులేఇది. ఒకరినిచూస్తే ఒకరికి పడదు. ఎవరిదర్జా వారిది. చిల్లరవాళ్లుకాని; అత నలసి-

పోయి ఉంటాడు. అప్పుడు మన మవలీలగా అతనిని జయింపవచ్చును, అని ఉపేక్ష చేసినారు.

రెండో: చిన్నరాజు లోడిపోయినతరువాతైనా వాళ్లెదిరించలేక-పోయారా ?

మొదటి: వీళ్లు రాజులుకారు, తరాజులు. వీళ్ళతో కప్పలతక్కెడ వ్యాపారం. ఒకరుకలుస్తే ఒకరు కలియరు.

రెండో: తాముకోరిన కన్యలను ఒకడు ఎత్తుకపోతూ ఉంటే, వీరికి పౌరుషమైనా పుట్టలేదా ?

మొదటి: పౌరుషం గంపలకొద్దీఉంది. రొయ్యకులేదూ, బారెడు మీసము ? కాని, ఇదిస్వయంవరం కదూ. ఇంతమందీ కలిసి కన్యకలను సంపాదిస్తే, వాళ్ళని పంచుకోవడ మెట్లాగ ?

రెండో: ఎట్లాగేమిటి ? వాళ్ళు అటు లాగ, వీళ్ళు ఇటు లాగ, తుదకు ఏదోసమాధానం కుదుర్చుకోవచ్చునే.

మొదటి: ఇదిబాగుంది. నూరుమంది ముగ్గురి నెట్లాపంచు-కొంటారురా ?

రెండో: పంచుకోకపోతే చస్తారా? ఆడపిల్లలు తక్కువపడితే అఆచారం వచ్చితీరాలి. మగపిల్లలసంఖ్య తక్కువయితే ఒకొక్కడికి పదిమందిపెళ్లాలు లేరూ?

మొదటి: నీవు సంఘసంస్కర్తవైనప్పుడు అఆచారాన్ని తెస్తువుగానిలే.

రెండో: నేను తెచ్చేదేమిటి? సంఘమే తెచ్చుకొంటుంది. నీవంటి ఛాందసులు మూలుగుతూఉంటే, మీకళ్లయెదుటనే అన్నీ జరుగుతూ ఉంటాయి. మీపని ఎప్పుడూ కసురుకొంటూ, తిట్టుకొంటూ కూర్చోవడమే. మీకోసము పరిణామ చక్రము తిరగకుండా నిలిచిపోతుందనుకొన్నావు కాబోలు.

మొదటి: నీవు బుద్ధిమంతుడవుగనుక ఈ ఉపాయం తోచిందిగాని, ఈరాజులకు తోచలేదు. నువ్వు వాళ్లతో చెప్పిఉన్నా బాగుండును.

రెండో: ఇప్పుడు మునిగిపోయిందేమీ లేదు. పోని, భీష్ముడే తీసుకపోనీ. మనకేల ఆగొడవ? మన రాజావారు ఇంటి మొగము పెట్టినారుగదా. ఇక మన ప్రాణాలకు భయములేదు. హాయిగా సంసారాలు చేసుకొందాము. ఎవడికో పెండ్లాము కావలసివస్తే, మన ప్రాణాలెందుకు పోగొట్టుకోవాలి.

(తెరలో కలకలము)

మొదటి: (అటువంకచూచి) ఒరే, ఊరుకోలేమురో, ఎవరో ఒక రాజు భీష్ముడికి అడ్డుపడ్డాడు. ఓహో! ఈయనా! సాళ్వరాజు. ఈయన గట్టివాడే. భీష్ముని ఒక్క ఊపు ఊపిచూస్తాడుగాని వదలిపెట్టడు.

రెండో: (పోయిచూస్తూ) బాగా నేపోరుతున్నాడు. ఎవ్వరికీలేని పంత మితనికెందుకు పుట్టిందో!

మొదటి: ఏమీలేదు. అంబలో పెద్దపిల్ల ఆయనకు తెలుసును. ఆ పిల్లను పెండ్లిచేసుకోవాలని చాలాకాలంనుంచీ ఉంది ఆయనకు.

రెండో: అట్లాచెప్పు! అందుకోసమేకాబోలు రథముమీదనుంచి ఆపిల్ల సాళ్వరాజుకు సైగలుచేస్తూ ఉత్సాహంకల్పిస్తున్నది. ఆసైగలు భీష్ముడుచూస్తే?

మొదటి: చూస్తే రథముమీదనుంచి ఒక గెంటు గెంటుతాడు. దాని పుణ్యం బాగుంది. భీష్ముడిదృష్టిఅంతా సాళ్వరాజు మీదే ఉంది.

శిండో: అయింది, అయ్యగారిపని. భీష్మ డెవరనుకొన్నావు? పరశురాముని శిష్యుడు. అదుగో, ఏదో పెద్దఅస్త్రము తొడుగుతున్నాడు. విడిచె; విడిచె!

మొదటి: ఎగిరె, ఎగిరె! రాజుగారు, రాజుగారితోరథము, రథముతో గుర్రాలు. వచ్చి మనదగ్గరగా పడతారేమో. మెల్లగా తప్పుకొందాము పద.

(పోతారు.)

## రంగము ౨.

(ప్రవేశము: భీష్ముడు, అంబ: త్రోవలో విడిది.)

అంబ: అయ్యా, దయచేసి నన్ను విడిచిపెట్టు.

భీష్ముడు: ఏమి?

అంబ: నీవు, సత్యవ్రతుడవు, ధర్మబద్ధుడవునుగదా.

భీష్ముడు: అవును.

అంబ: నీవు బ్రహ్మచర్యవ్రతమును పూనితివని విన్నాను.

భీష్మ: అవును.

అంబ: అయితే వ్రతసమాప్తి చేసుకోదలచినావా ?

భీష్మ: లేదు.

అంబ: అయితే మమ్మలినెందుకు తీసుకొనివచ్చినావు ?

భీష్మ: మీకు పెండ్లిచేయడానికి.

అంబ: పెండ్లికొడుకు కెవరు ?

భీష్మ: ఏమి ? ఆడదానికుండవలసిన బిడియము లేకుండా అడుగు-తున్నావు ?

అంబ: పెండ్లి కాకమునుపే నాలుగుమాటలూ తెలుసుకొంటే మంచిదిగదా.

భీష్మ: మాట లడగడానికి నీవే పూనుకొన్నావా ? పెద్దవా రడుగవలసినదానిని నీవడుగవచ్చునా ?

అంబ: పెద్దలు మొద్దులవలె ఊరుకొంటే.

భీష్మ: ఏమిటీ అవినయము ?

అంబ: ఇది అవినయము కాదు. పెండ్లిచేసుకొని కాపురము చేయవలసినదానను నేను. మా పెద్దలు నీతో కాపురము చేయరు. అందుచేత అడుగుతున్నాను.

భీష్మ: నీవన్నది ధర్మవిరుద్ధము ; ఆచారవిరుద్ధము. బాల్యములో తండ్రి, యౌవనములో భర్త, వృద్ధాప్యములో కొడుకులు స్త్రీని రక్షిస్తారు. స్త్రీకి స్వాతంత్ర్యార్హత లేదు.

అంబ: ఎవరా బుద్ధిమంతులు, ఇంతచక్కనిసిద్ధాంతముచేసినది?

భీష్మ: ఋషులు.

అంబ: అంటే?

భీష్మ: జ్ఞానముచేత సంసారపారమును చేరినవారు.

అంబ: చేరినవారా? దాటినవారా?

భీష్మ: ఎట్లయినా ఒకటే.

అంబ: ఒకటే ఎందుకవుతుంది? గట్టు బారెడుదూరములో ఉండగా మునిగిపోయినవా రెందరులేరు?

భీష్మ: వారట్టివారుకారు. వారు త్రికాలవేదులు. శాశ్వత ధర్మసంస్థాపకులు.

అంబ: ధర్మము కాలానుసరణము గదా. కాలము శాశ్వతము కానప్పుడు ధర్మమెట్లు శాశ్వతమవుతుంది?

భీష్మ: ధర్మము కాలానుసరణ మనుకొనుట తప్పు. అది శాశ్వతము.

అంబ: ఓహో, నీవున్ను నీపెద్దలున్ను శాశ్వతధర్మమునే అవలంబించినవారా?

భీష్మ: అవును.

అంబ: బ్రాహ్మణ గోస్తైన్యము ధర్మమేనా?

భీష్మ: ఆకర్మమునకు ఫల మనుభవించవలెను.

అంబ: క్షత్రియునికి శూద్రాసంతానము ధర్మవిహితమేనా?

భీష్మ: నాకర్థము కాలేదు. ఉదాహరణము?

అంబ: గంగాశంతను సంబంధము.

భీష్మ: ఓహో.

అంబ: చండాలీ బ్రాహ్మణసంబంధమో?

భీష్మ: అనగా?

అంబ: మత్స్యగంధీ పరాశరులు.

భీష్మ: ఊఁహూఁ.

అంబ: బ్రాహ్మణీ క్షత్రియసంతానమో?

భీష్మ: అదెట్లు?

అంబ: దేవయాని యయాతులు. అసంతతివారేకదూ, తాము?

భీష్మ: అంబా, చాలా పురాణములు చదివినావు. సంతోషించినాను. కాని, నీవు పలికినవన్నీ దేవరహస్యాలు. ఋషుల జన్మమును, మహాత్ముల జన్మమును తెలుసుకొన ప్రయత్నింపకూడదు. ధర్మములు సాధారణగృహస్థులకుగాని. లోకాతీతులకు కాదు.

అంబ: అట్లేమి? ధర్మము నతిక్రమించేవారేనా లోకాతీతులమని చెప్పుకొంటే?

భీష్మ: లోకము నమ్మదు; వారిని పరిగ్రహింపదు, నిందిస్తుంది.

అంబ: అయితే నీవు చెప్పినదానినిబట్టి ధర్మము లోకధర్మము, లోకాతీతధర్మము, అని రెండువిధము లన్నమాట.

భీష్మ: అవును. ఇప్పుడీ ధర్మవిచారమెందుకు?

అంబ: నీమనస్సుకే తెలియవలెను.

భీష్మ: ఈవృథాసంభాషణవల్ల ప్రయోజనము కానరాదు.

అంబ: ప్రయోజనమా ? స్త్రీ అస్వతంత్రి అన్నావుకదూ

భీష్మ: అవును.

అంబ: నీతల్లి గంగాదేవి స్వతంత్రగా ప్రవర్తించిందా ? అస్వ-తంత్రిగా ప్రవర్తించిందా ?

భీష్మ: నాతండ్రికిని ఆమెకును జరిగిన ఒక సమయముప్రకారము సంచరించింది. అందులో తప్పులేదు.

అంబ: నీతల్లిగనుకనా ?

భీష్మ: నీవు యుక్తిపరురాల ననుకొంటున్నావుగాని, నీమొండి మాటలకు తల, తోక, కనబడడం లేదు.

అంబ: తల ఉన్నవారికి తల కనబడుతుంది. తోకమాట నాకు తెలియదు.

భీష్మ: అయితే ఏమంటావు ?

అంబ: "పెండ్లికొడుకెవరు!" అని నేనడిగినప్రశ్నకు ప్రత్యుత్తరము

చెప్పుమంటాను. తప్పించుకొని వాదములోనికి దింపినావు.

భీష్మ: నీకెవరు కావలెను ?

అంబ: నీవే.

భీష్మ: నేను బ్రహ్మచారిని.

అంబ: అయితే నాతో నీకేమి ప్రయోజనము.

భీష్మ: నిన్ను, నీచెల్లెళ్లను నాతమ్ముడు విచిత్రవీర్యునికి పెళ్ళి చేస్తాను.

అంబ: పేరు బాగున్నది. విచిత్రమైన పేరే !

భీష్మ: అతడు మంచివాడు, అందగాడు, పరాక్రమశాలి.

అంబ: అతని మంచితనము, అందము, నేను చూడలేనుగాని, పరాక్రమముమాత్రము స్పష్టముగానే కనబడుతున్నది.

భీష్మ: ఎట్లు ?

అంబ: అన్నగారు దెబ్బలుతిని కన్యకలను తీసుకొనివస్తే, తాను కులుకుతూ పెండ్లిపీటలమీద కూర్చుంటాడు. ఇంతకంటే పరాక్రమ మేమికావలెను ?

భీష్మ: అట్లనకూడదు.

అంబ: ఏమి, నానోరు మూస్తావా!

భీష్మ: నీవే మూసుకోవలెను. నా భుజబలముచేత మిమ్ములిని సంపాదించినాను. మిమ్ము నాయిష్టమువచ్చినవారి కిచ్చి పెండ్లిచేస్తాను.

అంబ: నీకు భుజబలముంటే నీవు పెండ్లిచేసుకోవలెను. చేతగాని వానికా మమ్ములిని కట్టిపెడతావు? మంచి ధర్మాత్ముడవే. బలవంతపు పెండ్లివల్ల అనర్థాలు నీధర్మ శాస్త్రాలలో లేవేమో.

భీష్మ: నిన్ను విడిచిపెట్టేదిలేదు.

అంబ: నేను నీతమ్ముని పెండ్లాడేది లేదు.

భీష్మ: ఏమి నీసాహసము?

అంబ: ఏమి నీదౌర్జన్యము?

భీష్మ: నిన్ను విడిచిపెట్టకపోతే ఏమిచేస్తావు!

అంబ: విడిపించుకొని పోతాను.

భీష్ము: ఆడదానవే. నేను నిన్నిప్పుడు విడిచిపెట్టితే నీగతి ఏమవుతుంది ?

అంబ: నీగతే అవుతుంది. నీవు బ్రహ్మచారివి కావూ ? నేను బ్రహ్మచారిణి నౌతాను.

భీష్ము: నీవు మా వంశమునకు తగినదానవు కావు. కాని, నిన్ను చూస్తే జాలి అవుతున్నది.

అంబ: మనకు తారాబలము సరిపడలేదు. నీకూ నాకూ ఎదురు చుక్కగా ఉన్నది. నన్ను విడిచిపెట్టు. నన్నే కాదు, నా స్త్రీజాతి నంతటిని అవమానించినావు. నేను పగదీర్చు కోనిదే ఊరుకోను.

భీష్ము: ఓహో, ఇదికూడానా ? పౌరుషముగల ఆడవాళ్లకు నీవు ప్రథమోదాహరణమవు.

అంబ: చూతువుగాని.

భీష్ము: పోవే, పింజారీ. నిన్ను నేరకపోయి తెచ్చినాను.

అంబ: మాటలు తిన్నగా రాని.

భీష్ము: పో, పో. నీగతి కెవరేమి చేయగలరు ?

అంబ: ఎవరిగతి వారిది. నీగతిమాత్రి మెట్లుంటుందో ఎవరికి తెలుసు? నాబ్రతుకు చెరిపినావు. నేను కోరిన సాళ్వ రాజును పెండ్లాడనిచ్చినావు కావు. నీవున్ను పెండ్లాడి నావు కావు. నేనే అంబనయితే నీవ్రతము చెరిపి నిన్ను పెండ్లాడలేనప్పుడు చూస్తాను.

భీష్మ: అబ్బా! నావ్రతను చెరిపేదానవుకూడానూ? చెరుప లేకపోతే?

అంబ: నీకు మృత్యుదేవతనౌతాను.

భీష్మ: పోవే, అపదానా, పో. ఎందుకు నోరిదానవౌతావు? బుద్ధి తెచ్చుకొని ఎవనినైనా పెండ్లాడి సుఖపడు.

అంబ: (పోతూ) అయ్యో, కనికరం? అబ్బా, పరాక్రమం? ఓహో ధర్మపరాయణత్వము? శ్రీరంగనీతులు నాకూవచ్చు.
(పోవును)

భీష్మ: అబ్బా, ఆడవాళ్లలోకూడా ఎంత గడిదేరినవారుంటారు? కలికాలం ప్రవేశింపబోతున్నది. ఎన్నెన్నివింతలు పుట్ట గలవో! ఈ పీడ వదిలిపోయింది. దీని చెల్లె ళ్ళెటువంటివారో. చూదాము. (పోవును)

(తెర)

# చతుర్థాంకము

## రంగము ౧.

[ప్రవేశము: ఇద్దరు మునిబాలురు.]

మొదటి: ఏమి, దేవదత్తా, బహుకాలదర్శనము. ఎంతో కాలము నుంచీ మీవనములోని వార్తలే కరవైనవి.

రెండో: సత్యవ్రతా, మాగురువులవారందరూ సత్రయాగం ఆరంభించినారు. శిష్యుల కందరికీ నిండా పనిపడింది. ఉదయంనుంచీ ఉదయంవరకూ యాగసంభారాలు సమకూర్చుకోవడముతోనే సరిపోతున్నది.

మొదటి: యాగము పూర్తిఅయినదా ?

రెండో: కాలేదు. మధ్యలోనే ఆగిపోయినది.

మొదటి: ఏమి ?

రెండో: విపరీతాలు పుట్టి.

మొదటి: ఏమి పుట్టినవి ?

రెండో: ఎవరో ఒక ఆడది మావనములో చేరినది.

మొదటి: ఆడదా! ముసలిదా? పడుచుదా?

రెండో: ముసలిదయితే భయములేదు. పడుచుదిగనుకనే ఉపద్రవం.

మొదటి: అయితే మీ గురువులవారికి సంసారములోనికి పునః ప్రవేశము కలుగుతున్నదా ఏమిటి?

రెండో: లేదు. మాగురువులంత కచ్చబిగింపు లేనివారు కారు.

మొదటి: అయితే, ఉపద్రవమేముంది?

రెండో: ఆయమ్మకూడా తపస్సుచేయడాని కారంభించింది

మొదటి: ఏమిటీ! ఆడదా! తపస్సా!

రెండో: మరేమిటనుకొన్నావు? ఇలాంటి, అలాంటి తపస్సు కాదు. ఎండకాలములో పంచాగ్నిహోత్రాలమధ్య, చలికాలములో కుత్తుకబంటి నీటిలో.

మొదటి: అబ్బా! ఎవరో ఆమె?

రెండో: ఎవరో అంబ అట.

మొదటి: ఓహో! నేనుకూడా ఆమెను గురించి కర్ణాకర్ణిగా విన్నాను. సాల్వరాజు, భీష్ముడు, విడిచిపెట్టినదేకదూ?

రెండో: మరేమి ?

మొదటి: వచ్చింది ! ఆరంభించింది ?

రెండో: ఆరంభించడమేమిటి ? వనానికి అగ్గి పెట్టింది. దాని హాహానికి తట్టుకోలేక గురువులవారందరూ కలిసి ఆయమ్మ సమక్షానికిపోయి "మాయమ్మా, మాతల్లీ, ఏమికావాలో చెప్పు, మాచేతనయితే తెచ్చిపెడతాము" అని బ్రతిమాలుకొన్నారు. "నాకున్నూ భీష్మునికిన్నీ పెండ్లి చేయగలిగితే చేయండి. అతనిని పెండ్లాడేవరకూ నే నీతపస్సుమానను" అంది ఆమె.

మొదటి: లోకంలో ఆడవాళ్ళందరూ 'విడాకులో, విడాకులో' అని అఘోరిస్తూఉంటే, ఈయమ్మ 'పెళ్ళో, పెళ్ళో' అని పట్టించిందేమిటి ?

రెండో: దానికి కావలసింది పెళ్ళికాదు ; పంతం చెల్లడం. దాని ముఖవైఖరిచూస్తే, పెళ్ళయిన మరనాడే విడాకులిచ్చే తీరుగా ఉంది.

మొదటి: అయితే గురువులవారేమిచేశారు ?

రెండో: అందరూకలిసి సభచేసుకొని భీష్ముని నిర్బంధించకుండా

అంబ తపస్సు మానుకొనే ఉపాయాలెన్నో ఆలోచిం-
చారు. కాని, ఒక్కటీ సరిపోయిందికాదు. భీష్ముడు
బ్రహ్మచారినై ఉంటానని ప్రతిజ్ఞచేశాడే, అతని వ్రతము
ఎట్లా చెడగొట్టడమని ధర్మసందేహం కలిగింది. తుదకు
"మనమై అతని వ్రతభంగము చేసి ఎందుకు అధర్మంగా
సంచరించాలి. ఆయన గురువు పరశురాముడీ ప్రాంతా
లలో ఉన్నాడు. అతనిచేత చెప్పించి భీష్ముడు అంబను
పెండ్లిచేసుకొనేటట్లు ఒప్పింతాము" అని నిశ్చయించు
కొన్నారు.

మొదటి: అయితే పరశురాముడు భీష్మునితో చెప్పినాడా?

రెండో: ఇంకాలేదు. ఆయనను తీసుకరావడానికే వీరందరూ
పోయినారు. మాకందుచేతనే కొంచెము తీరిక కలిగింది.
చాలానాళ్ళనుంచీ నిన్ను చూడలేను, చూదామనివచ్చాను.

మొదటి: నామీద అభిమానమున్నదిగనుక వచ్చినావు.
(తెరలో: 'శిష్యా, నామాట విను.')

రెండో: అదుగో పరశురాముని మాటలవలెఉన్నవి. ఏమవుతుందో
చూదాము పద.

(నిష్క్రమిస్తారు)

## రంగము ౨.

[ ప్రవేశము: పరశురాముడు, అంబ, భీష్ముడు. ]

పరశు: శిష్యా, నామాట విను. ఇందులో ధర్మహానిలేదు.

అంబ: ఈయనవంశములో పరంపరగావస్తూఉన్న ధర్మహాని-కంటె ఇందులో ఎక్కువేముంది?

పరశు: అంబా, నీకేమిచెప్పినాను? ఊరుకోలేవూ?

అంబ: బాగుంది నాకీ అదమాయింపు.

భీష్మ: గురువుగారూ, ఆమెసంగతి మీకు అనుభవములేదు. దయచేసి నన్ను క్షమించండి. నన్ను నిర్బంధించకండి.

అంబ: నీసంగతి నాకనుభవము ఉంది. అందుకోసమే గురువుగారిని పిలుచుకొని వచ్చినది. నన్నెట్లా పెళ్లిచేసుకోవో చూస్తాను.

పరశు: ఊరుకోవమ్మా! బతిమాలుకొంటాను.

భీష్మ: వింటున్నారుగదా ఆమెధోరణి. ఇటువంటిదానిపక్షాన్ని అవలంబించడానికి మీకు మనసెట్లువచ్చింది?

అంబ: ఎట్లువచ్చిందా ? నీ మొండితనం చూచి.

పరశు: ఓహో ! మంచితంటా తెచ్చిపెట్టుకొన్నానే ! ఏమి అంబా, నీకుపెళ్లికావాలా, వద్దా ?

అంబ: భీష్మునితో పెళ్లి తప్పకుండా కావాలి. అతనిమీదే నాకెంతో యిష్టం. మొదట సాళ్వరాజును పెళ్లాడ-వలె ననుకొన్నానుగాని, ఇతనిముం దతడు దిగదుడుపున-కైనా పనికిరాడని తెలుసుకొన్నాను.

పరశు: పెళ్ళి కుదిర్చేవాడను నేను. నీకెందుకు ? మధ్యమధ్య అడ్డువచ్చి కార్యం చెడగొట్టకు.

అంబ: అదే నాకు కావలసినది.

పరశు: కార్యం చెడిపోవడమా ?

అంబ: అ...య్యో !

పరశు: అయితే, మరిమాట్లాడనని చేతిలో చెయ్యి వెయ్యి.

అంబ: ఇక ముందెప్పుడూనా ? నేను బ్రతికున్నంతకాలమూనా ? ఇక నేను మూగదానినిగా ఉండవలసినదే ?

పరశు: ఎప్పుడూకాదు, ఇప్పుడు.

అంబ: అయితే ఇదిగో నోరుమూసుకొంటున్నాను.
(చేతితో నోరు మూసుకొంటున్నది.)

పరశు: ఏమమ్మా, ఎప్పుడూ పిల్లచేష్టలే? ఇది హాస్యాలకు సమయమా?

అంబ: భీష్ముడు నా బావగనుక......అవ్......తప్పొచ్చింది. మాట్లాడను.

పరశు: భీష్మా, మొదట నీ మెను తిరస్కరించడముచేత అవమాన పడి, ఈమెకీధోరణి వచ్చింది కాని, స్వభావముచేత ఈమె ముగ్ధసుమా.

భీష్మ: సంగనాచి. పాప మీమెకేమీ తెలియదు. మిమ్మా నన్నూకూడా సంతలోపెట్టి అమ్మేస్తుంది.

అంబ: ఊం. మరేం.

పరశు: అంబా!

భీష్మ: మీరేకాదు, మీ తాతముత్తాతలు వచ్చినా దానినోప ముయ్యాలేరు.

అంబ: గురువుగారూ, వింటున్నారా ఆపేలాపన. (ఏడుస్తూ)

నన్ను గయ్యాళికింద కడతావా? ఇష్టం లేకపోతే ఊరుకోవాలిగాని, పేళ్లెంమకు పెట్టడం?

పరశు: అమ్మా, ఏడవకూడదమ్మ. ఊరుకో. భీష్మా, ఇదేమిటి? ఆడదాని నేడ్పించవచ్చునా?

భీష్మ: అది ఆడదికాదు. సిగ్గూ బిడియంలేని బండ. ఇదెక్కడ దొరికిందండీ గురువుగారూ, మీకు?

అంబ: నోరు సంబాళించుకో. నోటికివచ్చిన కూతలు కూస్తావు? (ఏడుస్తూ)గురువుగారూ, నాపని బాగాచేశారు! ఇందుకా ఇతని యెదుటికి తీసుకవచ్చారు? మీరేమో గురువులు. ఈయన శిష్యుడు. వినయవిధేయతలతో మీమాటమీద నడుస్తాడు, అని పుట్టెడాశతో వచ్చినందుకు బాగా చేయించారులెండి.

పరశు: ఏమిచేయడమమ్మా! నువ్వా, ఊరుకోమంటే ఊరుకోవు. అతడా అంతకంటేను. నీవు ఊరుకోకపోవడానికి కారణం లేకపోలేదుగాని, కార్యంపట్ల నేర్పూ, ఓపికా, ఉండవలెనమ్మా.

అంబ: నే నేమన్నాను? అన్నిమాటలూ అతనివ్తే అనిపించీ?

పరశు: నేననిపించానా ? ఏమమ్మా నామీదికే వస్తావూ ?

అంబ: మరెవ్వ రనిపించింది? అత వన్నిమాటలంటూఉంటే వింటూ ఊరుకోని ? చెవి నులిపి బుద్ధి చెప్పకపోతే, చెలరేగి పోడూ ? మంచి గురువుగారితనమే ! మీమాట వినక, మీ శరణుజొచ్చిన వారిని తూలనాడుతూ...శిష్యుడట, శిష్యుడు ! ఇందుకా ఇంతవిద్యా నేర్పినది ?

పరశు: నువ్వన్నమాటే మోనిజము. శిష్యుడు గురువుమాట కెదురు చెప్పకూడదు.

అంబ: అవునామరి ? గురువుగారు ముసలివారయినారు, తాను పడుచుదనంలో ఉన్నాడు, ఈయనమాట వినేదేమిటని ఈయన ఉద్దేశము.

పరశు: అల్లే కనబడుతున్నది.

భీష్మ: రామ, రామ ! అటువంటి ఉద్దేశం నాకెన్నటికిన్ని లేదు.

అంబ: లేదు ! లేదంటే ఎవరు నమ్మతారు ? గురువుగా రస్త్ర సన్యాసం చేసినారు. నీవద్ద అమోఘాస్త్రాలున్నవి. కార్యంపడితే యుద్ధానికిగూడా సిద్ధపడేవాడవే !

భీష్మ: ఇదికూడానా?

అంబ: ఇంకా యేమిటి? గోముఖవ్యాఘ్రానివి, కప్పకూత పామువి. కడుపునిండా విషమే!

భీష్మ: ఓహో!

అంబ: ఓహో, ఏమిటి, ఓహో! గురువుగారిని ధిక్కరించడానికి కారణం తెలుసుకొన్నానులే.

భీష్మ: ఆకారణ మేమిటో దయఉంచి చెప్పు.

అంబ: ఎందుకు గురువుగారికి కోపం తెప్పించడం? ఆయనకు కోపంవస్తే నీఖరతం పట్టించక మానరు. నాకార్యం చెడిపోతుంది.

భీష్మ: చాలులే, చెపుదూ?

అంబ: గురువుగారు చెప్పమంటే చెప్పతాను.

పరశు: చెప్పు.

అంబ: భీష్ముడు ఉత్తమ క్షత్రియకులసంభూతుడుకదూ?

భీష్మ: అవును. నాది ఉత్తమ క్షత్రియవంశమే. నాతండ్రి శంతనుమహారాజు.

అంబ: అయ్యో, ఇప్పుడు కాదన్నవారెవరు? నేను చెప్పినదీ అదే. గురువుగారూ! తాము ఉత్తమ ఋషికులమున పుట్టిన బ్రాహ్మణశ్రేష్ఠులు. తమతండ్రి జమదగ్నిమహర్షి.

భీష్మ: (తనలో) ఇది చాలా పెద్దయెత్తువేసినది. ఏమిచేయగలను? గురువుగారి కనుబొమలు ముడిపడుతూ ఉన్నవి. తన పూర్వచరిత్రమును స్మరణకు తెచ్చుకొంటున్నాడు. (ప్రకాశముగా) గురువుగారూ—

అంబ: ఉండూ! కారణం చెప్పమన్నావుకదూ? విను మరీ!

పరశు: (కండ్లెర్రచేసి) భీష్మా! నీ వుత్తమక్షత్రియుడవని గర్విస్తున్నావా? ఇరవై ఒక్క-సార్లు ఈభూమిని నిఃక్షాత్రము చేసినాను. క్షత్రియకీటకము లింకా మిగిలిఉన్న వేమి?

అంబ: కీటకములు కావవి. తేళ్లు. సమ్మరిపురుగని విడిచిపెట్టితే తేలు అంటవేస్తుంది. దానిబాధ ఆరుజాములు, ఆపాద మస్తకమున్ను.

భీష్మ: అంబా, గురువుగారి నిట్లురేపెట్టడము నీకుతగదు.

అంబ: భీష్మా, నన్ను పెండ్లాడక నాబ్రతుకు గంగపాలుచేయడము నీకున్నుతగదు.

భీష్మ: అయితే, మాయిద్దరికీ కలహంపెట్టే ప్రయత్నం మానవా

అంబ: అయితే, నన్ను పెండ్లాడవా?

భీష్మ: నేను ప్రతిజ్ఞాతబ్రహ్మచారినని నీకు తెలియదా?

అంబ: నేను రాచకన్నెనని నీకుమాత్రము తెలియదా?

భీష్మ: నీవెవరినైనా పెండ్లిచేసుకోవచ్చునే! నామీదనే ఎందుకు పట్టిస్తావు?

అంబ: కుక్కముట్టిన కుండను ఆచారపరు లింటిలో ఉంచుకోరే! నాబ్రతుకు అధ్వానము చేసినావే! నా మొర యెవరు వింటారు?

పరశు: భీష్మా, నీవు మాయెడల రెండు అపరాధాలు చేసినావు.

భీష్మ: గురువుగారూ. నావల్ల అపరాధముంటే క్షమించండి.

(అని కాళ్ళమీద పడుతున్నాడు.)

అంబ: చాలు నీనక్కవినయాలూ, నీకూటభక్తులూ!

భీష్మ: ఏమంబా, ఊరుకోవూ! నావ్రతము కాపాడవూ?

అంబ: అట్లా దారికిరా, మరీ! నేను ఆడదానిని కానుకదూ?

భీష్ము: కావమ్మా, కావు.

అంబ: అబ్బా! అయితే నేనెవరిని ?

భీష్ము: మొండిశిఖండివి.

అంబ: ఆఁ, ఇంకా అణగలేదు పొగరు ! నేను సిగ్గూబిడియమూ లేని బండను కదూ !

భీష్ము: అయితే అవుతావు. ఏమిటీఒదుగు నాకు, నీదగ్గర ?

పరశు: భీష్మా, నాకాళ్ళమీదపడి లాభములేదు. నావి రెండు కోరికలున్నవి. వాటిని తీరుస్తేనేకాని నిన్ను విడిచిపెట్టను,

భీష్ము: తీర్చడానికి సాధ్యమయిన కోరికలయితే శిష్యుడు చేతులు కట్టుకొని సిద్ధముగా ఉన్నాడు.

పరశు: రెండూ నీకు సాధ్యములే.

భీష్ము: అయితే సెలవివ్వవచ్చును.

పరశు: నీకిచ్చి పెండ్లిచేస్తానని ఈ అంబకు మాటయిచ్చినాను. దీనిని నీవు పాణిగ్రహణము చేసుకోవలెను.

భీష్ము: అది ఎన్నటికిన్ని సాధ్యముకాదు. లోకమంతా విన్నట్లు

చేసిన ప్రతిజ్ఞను భంగముచేసుకొని, నాతండ్రి నవమానము చేయజాలను. పితృభక్తిపరాయణులగు తా మీవిషయమున నన్ను నిర్బంధింపకూడదు.

పరశు: ఏమీ ?

అంబ: ఒకకోరిక చెల్లిపోయినది. ఇక రెండోది.

భీష్మ: అంబా, నీవూరికే రెచ్చగొట్టవద్దు. ఎంతకయినా సాహసురాలివలె ఉన్నావు.

అంబ: గురువుగారినిధిక్కరించే నీసాహసముముందు నాదేపాటి !

భీష్మ: గురువుగారు నన్ను క్షమింపవేడుతున్నాను.

అంబ: చంకమడ్డు, శరణార్థి. గురువుగారు రెండోకోరికనుకూడా తెలిపేస్తే సరి. అదికూడా సాధ్యము కాదంటాడు. అంతటితో తీరిపోతుంది.

పరశు: భీష్మా, నా రెండోకోరికమాత్రము తీరుస్తావని నాకేమి నమ్మకము ? ఇక నీవు నాకు శిష్యుడవ్వకావు. నేను నీకు గురువునుకాను. నన్నవమానించినావు. నామాట చెల్లించినావుకావు. సాహసముతో నీవు చక్కబడవు.

నీగర్వ మడిగితేగాని నీవు దారికిరావు.

అంబ: ఈముసలితొక్కు నన్నేమిచేయగలడని శిష్యుని అహంకారము.

పరశు: అక్కేమి? భీష్మా, నన్ను గెలిచి నామాటమీరిపో. అంతవరకు నిన్ను వదిలేదిలేను.

భీష్మ: గురుధిక్కారదోషము సహింపవచ్చునుగాని, ప్రతిజ్ఞాభంగమునకు నే నోర్వజాలను. అది నా క్షాత్రమునకు కళంక కారణము.

పరశు: క్షాత్రము, క్షాత్రమని ప్రేలుతావు. ఇంకా లోకములో క్షాత్రమెక్కడనున్నదిరా? రా, నీక్షాత్రము చూస్తాను.

భీష్మ: ఇదిగో నమస్కారబాణము.
(బాణము పరశురాముని పాదములవద్దకు వదలుతున్నాడు)

అంబ: అయినది అయ్యగారిపని. అనుకొన్నంతా చేసినాడు.

భీష్మ: ఓసీ, అంబా, ఆడదానవుగనుక బ్రతికిపోయినావు. లేకుంటే—

అంబ: ఓ, చాలులే బెదిరింపులు. గురువుగారు నన్ను రక్షిస్తూ ఉన్నంతసేపు నీవు నన్నేమిచేయగలవు?

పరశు: అబ్బా, భీష్మ, ఎంతవాడవయితివిరా? పద, యుద్ధము చేదాము. నిన్నోడించి, ఈఅంబను నీను పెండ్లిచేయక పోతే నేను పరశురాముడనే కాను.

భీష్మ: నాకు యుద్ధభయమును తామే తీర్చినది. ధర్మ సంరక్ష-ణార్థము గురువుతోనయినాసరే యుద్ధముచేయడాని కేల జంకవలెను? దయచేయండి. (పోతూ) అమ్మా, ఆడదానవౌనువే, అంబా!

అంబ: అబ్బా, మగధీరుడవౌనువురా, భీష్మ!

(భీష్మ పరశురాములు నిష్క్రమిస్తున్నారు.)

అంబ: నేను చేయగలిగినపని చేసినాను. ఫలము దైవాధీనము. ఈభీష్ము డోడిపోతేమాత్రము నన్ను పెండ్లిచేసుకొం-టాడని ఎక్కడఉంది? పెండ్లి చేసుకొంటేమాత్రము నన్ను సరిగా బ్రతుకనిస్తాడా? పరశురాముడే ఓడిపోతే ఈజన్మములో నాకు మరి సౌఖ్యములేనేలేను. ఇక్కడ కీఅవతారము చాలించుకోవలసినదే......భీష్ముని పెండ్లి చేసుకోదలచిన దానను సరియైన విధానము నవలంబించి-నానా? వివాహబంధమునకు విరోధము పనికివస్తుందా? నేనేమి చేయగలను? నాలోని ప్రకృతి నన్నిట్లు నడిపిం-

చింది. ఆనాడు దేవదూతపలికిన పలుకులు జ్ఞప్తికి వస్తున్నాయి. భీష్ముడు దేవాంశసంభూతుడన్న మాట నిజమే నేమో! నేనతనికి మారకురాలను కావడముకూడా దైవనిర్ణయమే నేమో!....అదుగో యుద్ధము చేస్తున్నారు. ...గురుశిష్యు లొకరికొకరు తగినవారే. వీరి దివ్యాస్త్రాల జ్వాలలు భూనభోంతరాలను కప్పివేస్తున్నవి. పరశు రాముడదుగో ఏదో అస్త్రమును తొడుగుతున్నాడు... వదలినాడు...భీష్ముడు పడినాడు...లేదు, క్షణకాల మూర్ఛ...లేచినాడు. ప్రత్యస్త్రము తొడిగినాడు. ఏదో గొప్ప అస్త్రమే. 'వద్దు భీష్మా, ఆ అస్త్రమును వదలకు. నేనోడిపోయినా' నంటున్నాడేమి చెపుమా! ఇంతేనా? అయినదా? నా బ్రతుకు బూడిద పోసిన పన్నీరేనా?

[ భీష్మ పరశురాములు తిరిగీ ప్రవేశిస్తున్నారు. ]

పరశు: భీష్మా. నీపరాక్రమానికి మెచ్చుకొన్నాను. నేను నేర్పిన విద్య సుశిక్షితముగా ఉన్నదో లేదో పరీక్షించడానికి నీతో యుద్ధమారంభించినాను. నీ అస్త్ర కౌశలమునకు మెచ్చుకొన్నాను. నీధర్మనిరతికి సంతోషించినాను.

భీష్మ: ధన్యుడ నైనాను.

పరశు: శిష్యా, నీకొక రహస్యము చెప్పవలసిఉన్నది. కొలది ఏడులలో కలియుగ మారంభింపబోతున్నది. యుగ సంధిలో గొప్పయుద్ధమొకటి జరుగగలదు. అదే మహా భారతయుద్ధము. నీవు కాశీరాజుకన్యకలను తీసుకొని పోయి ఆయుద్ధములో పాల్గొనవలసిన వీరుల జన్మమునకు దారిచేసినావు. ఆవీరులకు నీ వస్త్రవిద్యను నేర్పవలసి ఉంటుంది. వారిలో అర్జుననామధేయునికితప్ప ఇతరు, లెవ్వరికిని నేను నీకు నేర్పిన అమోఘాస్త్రములను తెలుప వద్దుసుమా. అతని మూలముననే జనక్షయ మెక్కువగా కావలసి ఉంటుంది. నీతోను, అర్జునునితోను, నేను నేర్పిన అస్త్రములమహిమ అంతరించిపోతుంది. నాయనా, ఆయుద్ధము నారంభించి. అస్త్రసన్యాసముచేసి, లోకము-నకు ధర్మములనుపదేశించి నీఅవతారమును చాలించుకో.

భీష్మ: చిత్తము. శిష్యుని ప్రణతులను స్వీకరించండి.

పరశు: నాయనా, ఆచంద్రార్కయశస్కుడవుకా.

భీష్మ: గురువరా, పోయివస్తాను. అనుజ్ఞ ఇవ్వవలెను.

పరశు: మంచిది, నాయనా, పోయిరా.

(భీష్ముడు నిష్క్రమిస్తాడు.)

పరశు: (అంబనుసమీపించి) అంబా, భీష్మునికి నేనోడిపోయినాను.

అంబ: అయితే నాకేమిదారి చూపుతారు?

పరశు: నేనేమిచేయగలను? నేను ముసలివాడనైనాను. చాల కాలమయినది అస్త్రసన్యాసము చేసి. వేళకుతగిన అస్త్రాలు స్ఫురణకు రాలేదు.

అంబ: మిమ్ము శరణుజొచ్చినాను. మిమ్ము నమ్ముకొన్నాను. భీష్ముని సాధించేఉపాయము నాకుపదేశిస్తేనేకాని, నేనీ అవమానపుబ్రతుకు బ్రతుకజాలను.

పరశు: (ఆలోచించి) అంబా, ఈ జన్మములో నీవు భీష్ముని సాధించలేవు.

అంబ: మరెప్పుడు సాధించేది?

పరశు: మరొక్క జన్మములో.

అంబ: అయితే ఈజన్మమును చాలించుకొనుమని సెలవా?

పరశు: అది నీఅవమానభారమునుబట్టి నీవాలోచించుకోవలసినది. స్త్రీహత్యాంగీకారదోషమునకు నన్ను పాలుచేయకు. అమ్మా, నీవుపో. నీమూలముగా కొండలను అడవులను పట్టి తపస్సుచేసుకొంటూ ఉన్న నేను తిరిగీ అస్త్రములను స్మరింపవలసి వచ్చినది. నేనింక ఇక్కడ ఉండకూడదు.

(పోతాడు.)

అంబ: ఓహో! నాకు దిక్కులేదా? ఈజన్మములో భీష్ముని సాధంచలేనా? మరొకజన్మములో సాధించగలనా? నాఅవమానభారమునుబట్టి నాగతిని నిర్ణయించుకోవలెనా? సరే, నిర్ణయించుకొన్నట్టే.

(నిష్క్రమిస్తుంది.)

# పంచమాంకము.

## రంగము ౧.

[రాజవీధి: ఇద్దరు బ్రాహ్మణులు ప్రవేశిస్తున్నారు.]

పప్పుశాస్త్రి: ఏమి, నేతావధానులూ, అంత ఘుమఘుమలాడుతూ, చిద్విలాసముగా పోతున్నావు? ఎక్కడనైనా ఏమయినా బేరము తగిలిందా యేమిటి? ఒక్కసారి నిలబడకూడదూ.

నేతావధానులు: ఓహో పప్పుశాస్త్రి, నువ్వా! బహుకాలదర్శనం? ఈమధ్య మనమిద్దరమూ కలుసుకోలేను. అవును, నాతో నీకేమిపని? నూనెదీక్షితుల సహవాసము మరిగినావు.

పప్పు: అవును, ఇప్పుడు నువ్వు రావుగారి నాశ్రయించినావు. మమ్మలిని చూస్తావా? అక్కడ మీ నారకేళఘృతచయనులు, మూలచణకతైలోపాధ్యాయులు, వృషభమదమిశ్రులవారు, అందరూ కలుస్తూఉంటారు. అనేకస్థలాలనుంచి మీకు వార్తలు వస్తూఉంటవి. కొత్తవార్తలేమయినా ఉన్నవా?

నేతా: వార్తలకేమి? అన్నీవార్తలే. కాని, మరచినాను. పులుసు

పండితుల వారికి మీపిల్లనిస్తారట నిజమేనా? ఎప్పుడు ముహూర్తం నిశ్చయించారు? .

పప్పు: దానినిగురించే ఆలోచిస్తున్నాము. కాని, ఆయన నన్ను-గురించి నీతో ఆలోచించి మాటచెప్పుతా నన్నాడట. నువ్వు కేవలం లౌక్యుడివి. కప్పా విప్పా సమర్థుడవు. సంబంధం చెడగొట్టకేం? మనం మనం చిరకాల స్నేహితులము.

నేత: అయ్యో, శాస్త్రీ, నన్నుగురించి అట్లా అనుమానించడము న్యాయము కాదు. కాని, పులుసుపండితుడు బలే కుయుక్తిపరుడు. అతనికి నామీద ఏలాటి అనుమానం తగిలినా, కలకాలం కారాలు, మిరియాలు నూరుతూ ఉంటాడు. అతనితో వేగడం చాలాకష్టం. నన్ను మీపిల్లవిషయమై అడిగినాడుకాని, నేనుస్వయముగా చూడనిదీ ఏమీ చెప్పలేనన్నాను.

పప్పు: చాలులే, ఇదా నువ్వుచేసిన ఉపకారం? ఏమి, చూస్తేగాని చెప్పలేక పోవడానికి నాకూతురు ఆడపిల్ల కాదనుకొన్నావా? దానికేమయినా వంకలున్నవనుకొన్నావా! దాన్ని చిన్నప్పుడు నువ్వు చూస్తూనే ఉండేవాడివే!

నేతా: అవును ! చూచినజ్ఞాపకమున్నది! కాని, ఏమో కాలాలు చాలా విపరీతమయిపోతున్నవి. ఆడపిల్లలు మగపిల్లలయి పోతున్నారు; మగపిల్ల లాడపిల్లలయిపోతున్నారు.

పప్పు: ఏమి టీవిడ్డూరపుమాటలు? చెప్పేవానికి జ్ఞానములేకపోతే వినేవానికయినా వివేకముండవద్దా ? ఎక్కడయినా విన్నామా ఇటువంటిమాటలు ? ఎవరయినా వింటే నవ్విపోతారు.

నేతా: అయ్యో వెర్రిబాగులవాడా ! పొరుగూరిలో ఒక విచిత్రం జరిగిందట విన్నావా ?

పప్పు: ఏమిటది ?

నేతా: ఎక్కడనుంచో యాత్రమీదపోతున్నామని ఒకస్వామి తన కుమార్తెతో వచ్చినాడట. అక్కడ ఉద్దులప్ప యింట్లో బసచేశారు. ఉద్దులప్ప కొడుకు ఇడ్డెనయ్య నీకు తెలుసును గదూ ?

పప్పు: తెలియకేం ? పద్దాచార్ల సత్రంలో తెల్లవారితే ప్రత్యక్షం! ఆపిల్లపేరేమన్నావు ?

నేతా: సంబారమ్మ అని పిల్లతండ్రి చెప్పినాడు. తండ్రిపేరు

ఎరగడ్డమప్ప, వురఫ్ పలాండుస్వామి.

పప్పు: ఊఁహూఁ? అయితే ఏమయింది? పెళ్లి జరిగిందా?

నేతా: జరగకేం? పద్దాచార్లే కుదిర్చినాడు. ఉద్దులప్పచేత పలాండుస్వామికి కొంతసొమ్ము ముట్టజెప్పించినాడు. మధ్యవర్తిగా ఆచార్లేమిపుచ్చుకొన్నాడో మనకు తెలియదు. కాని, తెల్లవారుతూఉండగా కనుచీకటిలో ముహూర్తం. సత్రింలోనే మినుకుమినుకుమని దీపంపెట్టి వధూవరులను కూర్చోపెట్టి, ముడిపడిం దనిపించారు.

పప్పు: ఏ మంతహడావడి? పెళ్లి కెవరినైనా పిలిచినారా, లేదా?

నేతా: ఇద్దెనప్పపెండ్లికి ఒకరిని పిలువడమెందుకు? వివాహం జరిగినది సత్రములో అయె. పెండ్లిపెద్ద పద్దాచార్లాయె. ఆవేళ కందుకొన్నవాళ్ళందరికీ విందే.

పప్పు: పిలువకుండా వచ్చినవాళ్ళందరికీ విందుచేయడానికి ఉద్దులప్ప ఒప్పుకొన్నాడూ? మర్దించినకొద్దీ బంకవలె సాగుతాడే?

నేతా: విందుసంగతంతా పద్దాచార్లే చూచుకొన్నాడు. నేను చెప్పవచ్చే దేమిటంటే, పెండ్లిపీటలమీదనుంచి లేవడం

తోనే, వచ్చిన అతిథుల కోలాహలంమధ్య, పలాండు స్వామి సంబారమ్మతోకూడా పరారీఅయినాడు.

పప్పు: అబ్బా! ఎంతమోసం? ఇటువంటివికూడా జరుగుతున్నాయీ! అయితే పద్దాచార్లూ, ఉద్దులప్పా ఊరుకొన్నారా?

నేతా: పద్దాచార్లేమిచేస్తాడు? సత్రం కదలడానికి వీలులేదు. సత్రంసామానులుకూడా కొన్నికనబడలేదట. నెత్తీనోరూ కొట్టుకొన్నాడట. ఉద్దులప్పమాత్రం కొంతవరకు సాగినాడుగాని కార్యంలేకపోయింది.

పప్పు: ఏమిచేశాడు?

నేతా: రాజుగారిరక్షకభటుడు కామప్పతో చెప్పుకొన్నాడట.

పప్పు: అవును. ఆయన గట్టివాడే. కూబీతియ్యడములో అతనిని మించినచెయ్యి లేదనుకొంటారు.

నేతా: స్వామివారి వాసననుబట్టి జాడ తీయగాతీయగా, రుద్రప్పసెట్టి యింటిలో వారు దాగున్నట్టు భోగట్టా తెలిసింది.

పప్పు: అట్లాజాడ తియ్యడం కామప్పగారికే చెల్లింది. దానితో

రాజావా రాయనను 'అపరాధపరిశోధకాచార్య' అని అయినా 'అల్లరికళ్లరగండ' అని అయినా బిరుదమిచ్చి, గండపెండేరము తగిలించి ఉంటారు.

నేతా: పలాంగుస్వామి పట్టుబడిలేకదూ! కొసవరకూ వినుమరీ.

పప్పు: అన్నా, వీడినుంపదెగా! అయితే, పలాండుస్వామి పట్టుబడలేదూ?

నేతా: వాడుపట్టుబడతాడటయ్యా, పిచ్చిమాటలూ? కామప్ప గారు రుదగ్రిప్పసెట్టిమీద సెర్చివారంటు జారీ చేసినారు.

పప్పు: సెట్టిని వెతకడానికా, సెట్టియింటిని వెతకడానికా, వారంటు?

నేతా: ఇంటిని, సెట్టినికూడాను. ఇంటిలో వాళ్లు కనబడక పోతే, సెట్టినికూడా వెతకవలెననే కామప్పగారిఉద్దేశం?

పప్పు: ఇదేమి టీఆశ్చర్యంమాటలు? సెట్టిని వెతికితే మనుష్యులు చిక్కుతారా?

నేతా: అయ్యో! సెట్టి సామాన్యుడనుకొన్నావేమో? ఆబాన-కడుపులో ఎంతమంది నిముడ్చుకొన్నాడో, నీకేమి తెలుసు? ఆపళంగా కామప్పగారు సెట్టియింట్లో ప్రవేశించి చూచేసరికి___

పప్పు: ఏమయింది ?

నేతా: అక్కడ వంటింట్లోలో పలపలనయి పలాండమ్మ, గడ్డ కట్టుకొని సంబారప్ప కనబడ్డారు.

పప్పు: ఏమిటీ? పలాండుస్వామి పలాండమ్మ అయిందీ ? సంబారమ్మ సంబారప్ప అయినాడూ ? వేషాలు మార్చు కొన్నారేమో.

నేతా: కామప్ప ఊరుకొంటాడా ? అదరించినాడు, బెదరించి-నాడు, చేయవలసిన పరీక్షలన్నీ చేసినాడు. ఉహ్హూం ! నిజంగా మగవాడు ఆడది, ఆడది మగవాడు, కామప్ప నిర్ఘాంతపోయినాడు. వెంటనే మన ద్రుపదరాజుగారి యెదుట పెట్టినాడు.

పప్పు: రాజుగారుకూడా చాలా ఆశ్చర్యపడిఉంటారు.

నేతా: ఆశ్చర్యంలేదు, గీశ్చర్యంలేదు. చాలా సంతోషపడి, 'కామప్పా, ఆడది మగవాడు కావడం, మగవాడు ఆడది కావడం అనేవిషయమును స్థిరపరచినందుకు నిన్ను చాలా అభినందిస్తున్నాము. నిన్ను రక్షకభటాధ్యక్షునిగా నియమించి, మా అంతరంగికమంత్రివర్గములో చేర్చుకొం

టున్నాము. చాలాకాలమునుంచీ, ఎంతోధనము ఖర్చు పెట్టి, ఈలింగపరివర్తనము సాధ్యముచేయడానికి వైద్యుల-చేత పరిశోధనలు చేయించినాము. కాని, ఎవ్వరికిన్ని చేతనయిందికాదు. ఈనాటికి ప్రత్యక్షముగా ఆపని సాధ్యమేఅని ఋజువయింది. ఈపలాండమ్మను, సంబా-రప్పను మనకోటలోనే వైద్యులవశములోఉంచి శీఘ్రముగా ఈ పరివర్తనములోని రహస్యమును కనుక్కొ-మందాము' అని అన్నారు.

పప్పు: రాజుగారి కీపిచ్చియేమిటి? ఈరహస్యమేదో తెలిసిపోతే లోకములో చాలాచాలా నాటకాలు జరిగిపోతాయే?

నేతా: రాజుగారి కీవిషయమై చాలాపట్టుదల. దీని రహస్యం రాజుగారిపురోహితుడు లడ్డుకాచార్యులు నాతో చెప్పినాడు.. కాని, అది నీతో చెప్పకూడదు.

పప్పు: నేతావధానులూ, ఈనాటికి లడ్డుకాచార్యులు నీస్నేహితుడయినాడని, చిరకాలస్నేహితుణ్ణి నన్నెడముచేస్తావా? ఆరహస్యమేమిటో నాకుకూడా చెప్పకూడదూ? నేను మరెవ్వరితోను చెప్పనులే.

నేతా: మరెవ్వరితోను చెప్పినావంటే నామీద ఒట్టుసుమా.

నీమీద ప్రేమచేత చెప్పుతున్నాను.

పప్పు: ఎవ్వరికీ చెప్పనులే.

నేతా: (చెవిలో) మన రాజుగారి కుమారరత్న మున్నారే, శిఖండిగారు ?

పప్పు: ఆఁ !

నేతా: వారు కుమారరత్నముగారు కారు. కుమారీ రత్నముగారు.

పప్పు: ఆఁ ! ఆఁ ! మొన్న నే కాదూ దశార్ణరాజు హేమవర్మగారి కుమార్తెనిచ్చి యువరాజుకు పెళ్ళిచేశారు ? ఇంకా నువ్వూ నేనూ అప్పటి సంతర్పణలలో తిరుగుతూఉన్నట్లే ఉన్నది !

నేతా: అవునయ్యా ! యువరాజుగాని పెళ్ళికూతురికిగాని, పెళ్ళికూతురువారికిగాని చూపించినా రనుకొన్నావేమిటి ? ఆపిల్లను కర్తకిచ్చి పెళ్ళిచేశారని వినలేదూ ?

పప్పు: అవునూ ? ఆపిల్ల ఇక్కడనే మనయువరాజావారి అంతః-పురములోనే ఉన్నదట ! పునస్సంధానమయిందా ?

నేతా: ఏదో లాంఛనానికి అయిం దనిపించారు. అక్కడ అమ్మగారికి అమ్మగారికి సమావేశం ? ఏమవుతుంది ?

పప్పు: ఔరా ! ఏమాశ్చర్యం ? అయితే పాప మాపిల్లగతి యేమవుతుంది ? రాజుగారు చాలామంచివారని వింటామే ! ఇట్లా ఆపిల్ల గొంతుక కోయడం బాగుందా ?

నేతా: ఆయనేమిచేస్తాడు, పాపం ? ఎందరో ఋషులను సేవించినాడు; ఎందరో దేవతలను కొలిచినాడు. రాణీగారు ఎన్ని అశ్వత్థప్రదక్షిణాలో చేసింది; ఎన్ని తీర్థయాత్రలో సేవించింది. తుట్టతుదకు దైవానుగ్రహంవల్ల గర్భవతి అయింది. రాజదంపతులు పరమానందభరితు లయినారు. కాని, గ్రహచారం ఎవరుతప్పింపగలరు ? నవమాసములు మోసి, ఆడపిల్లను కన్నది.

పప్పు: పాపం !

నేతా: రాజుగారు చాలావిషాదపడి, నేనుచేసుకొన్న పుణ్యమింతే అనుకొన్నాడు కాని, రాజ్యంమాటో ? తాను ముసలి-వాడవుతున్నాడా? తనతరువాత రాజ్యం పరరాజుల పాలవుతుంది ! ఈ మాట మనసులో ఉంచుకొని ఒక సాహసం చేసినాడు.

పప్పు: ఏమిచేసినారు ?

నేతా: ఏమీలేదు. రాజుగారికి సుపుత్త్రిజననమయిందని చాటింపించినారు.

పప్పు: అబ్బా, ఎంతతమాషా చేసినారు ?

నేతా: అప్పటినుంచీ ఆపిల్లను మగవానిగానే పెంచినారు. ఈరహస్యం పిట్టకయినా తెలియదు.

పప్పు: అయితే ఎప్పుడో ఒకప్పుడు రహస్యం బయలు పడుతుందని రాజుగారికి తెలియదూ ?

నేతా: తెలియకపోలేదు. కాని, మనుష్యజీవితములో ఎన్ని పరివర్తనాలు కలుగవు ? అదృష్టమే ఉంటే, నాపుత్త్రిక పుత్త్రుడు కాకపోతాడా, అని ఆశపెట్టుకొని అట్లాచేసినాడు. ఈశ్వరునివరముకూడ రాజావారికి అట్లాఉన్నదట.

పప్పు: పాపం ! సంబారమ్మ సంబారప్ప అయినట్లే మనరాజకుమారికూడా రాజకుమారు డయితే మన చెన్నకేశవ స్వామికి సహస్రనారికేళాభిషేకం చేయిస్తాను.

నేతా: పప్పుశాస్త్రీ, లడ్డుకాచార్యు లెందుకో రమ్మన్నాడు. ఇంకా ఏమిఆశ్చర్యాలు కలుగబోతున్నవో, పోయివస్తాను.

పప్పు: నేతావధానులూ, ఇదిగో, నీకేమయినా తెలుస్తే నాకు చెప్పడం మరచిపోకేం ?

నేతా: అయ్యో ! పప్పుశాస్త్రి ! నిన్ను మరచిపోవడమేనా !

(పోతున్నాడు)

పప్పు: (పిలిచి) ఇదిగో శాస్త్రి, నాకూతురు పెండ్లిమాట !

నేతా: సరే, లే.

(పోతున్నారు.)

## రంగము ౨.

[కుబేరుని ఉద్యానవనం: శిఖండి ప్రవేశము.]

శిఖండి: (తనలో) అహా, ఏమి నాఅవస్థ ? నేనెవతెను ? నేనీ జన్మ మెందుకెత్తవలెను ? నేనీలోకములో చేయవలసిన పని యేమయినా ఉన్నదా ? నరజాతికి పూర్వజన్మస్మృతి ఉంటే ఎంతబాగుండును ! జీవులు తమతమ కర్మముల ననుసరించి ఆయాజన్మముల ఎత్తుతూఉంటారని అంటారు. దేహత్యాగమునకు పూర్వము మనస్సులో ఉత్కటముగా ఉండేకోరికనుబట్టి ఉత్తరజన్మము కలుగుతుందట. పూర్వ

జన్మవాసన ననుసరించి యీ జన్మములో మనుష్యుల ప్రవర్తన మేర్పడుతుందట. ఇవన్నీ ఊహలనుకొంటాను. పూర్వజన్మ సంకల్పమునకున్ను, ఉత్తరజన్మ ప్రవృత్తికిన్ని సంబంధమే ఉంటే, పూర్వజన్మస్మృతికూడా ఉండితీరవలెను. కాని, పూర్వజన్మస్మృతి నరులకు లేదన్నమాట స్పష్టము. ఉన్నదనుకొనడము అనుభవవిరుద్ధము. అయినా. ఏదో అనిర్వాచ్యమైన, అవ్యక్తమైన సంకల్పము పూర్వపరజన్మముల కెడతెగని బంధముగా ఏర్పడి ఉంటుందనడాని కప్పుడప్పుడు కొన్ని సూచనలు కనబడుతూఉంటవి, ......అయితే నేనెవతెను ? పూర్వజన్మములో స్త్రీనా, పురుషుడనా ? స్త్రీ లెప్పుడును స్త్రీలుగాను, పురుషు లెప్పుడును పురుషులుగాను పునర్జన్మము నెత్తుతారా ? కాదనుకొంటాను. సంకల్పమునుబట్టి పుంస్త్వ స్త్రీత్వాలుకూడా ఏర్పడవచ్చును. నేను పూర్వజన్మములో స్త్రీ నేకాబోలును ? కాని, పురుషుడనై జన్మించి, పురుషోచితకార్యమును చేయసంకల్పిస్తూ శరీరత్యాగము చేసిఉంటాను. సంకల్పచాంచల్యమువల్ల తిరిగి స్త్రీనై జన్మించినా, పురుషవేషము, పురుషచేష్టలు, నాకీజన్మములో సిద్ధించినవి......ఈపురుషవేషమువల్ల నాకున్ను నాతలి

దండ్రులకున్ను విడదీయరాని చిక్కులు కలుగుతున్నవి. నేను స్త్రీనని నాభార్యకు తెలిసిపోయినది. ఆమె తనతండ్రి కీవిషయమై రహస్యముగా వర్తమానముపంపినట్లున్నది. అతడు దూతను పంపినాడు. దూతకట్టి సమాచారమున్న తెలియనీయకుండా నాతండ్రి పంపివేసినాడు. నామామ హేమవర్మ సైన్యములతో నా పురమును ముట్టడించి ఉన్నాడు. నాతండ్రి ముసలివాడై ఇంటిలో ఒకమూల ఒదిగిఉన్నాడు. సేనలేమో సిద్ధమవుతున్నవి, గాని, మామామగారిని జయించగలవా? ఉత్తమాట. తెల్లవారితే నాగుట్టు బయలుపడుతుంది; ఆమీద ఏమికానున్నదో? ...ఇన్ని అనర్థములకున్ను నేనేకదా కారణము. నేను పుట్టబట్టి నాతలిదండ్రులకా అజన్మదుఃఖహేతువనైతిని, మోసగించి పెండ్లాడిన ఆరాజకుమారికా అవమానకారణమైతిని. దశార్ణరాజుమామగారికా సరిరాజులలో తలయెత్తి తిరుగలేకుండచేస్తిని. ఛీ! ఇదేమిబ్రతుకు? నేను లేకుంటే ఇంతమందికి ఈకష్టముండబోదుగదా! బ్రతికి ఉండి నేనేమిచేయవలెను? సంకల్పశూన్యమైన బ్రతుకు నిరర్థకము గదా. ఇదిగో త్రాడు! ఈ చెట్టుకొమ్మకు వ్రేలాడితే, అవలీలగా......(దేవదూత ప్రవేశము)...

ఇదేమిది ?...ఎవరో వస్తున్నట్లున్నది !...ఆపాదమస్తకము ధవళవస్త్రాచ్ఛాదితమై ఉన్నది ఈరూపము ... ఓహో, ఎవరునీవు ? ఈరాత్రివేళ ఇక్కడికి ఏలవస్తున్నావు ?... (దేవదూత సమీపించును)...ఏమి ! మాట్లాడవేమి ?......

దేవదూత: అంబా !

శిఖండి: అంబా ! అంబయెవరు ? ఇక్కడ ఆపేరుగలవారు లేరు.

దేవదూత: నీవే.

శిఖండి: నేనా ?

దేవదూత: అవును.

శిఖండి: ఏమీ, నేనంబనా ? ఏమో, ఒళ్ళు జలదరిస్తున్నది. ఏదో కలలో ఉన్నట్లున్నాను. ఎవరది ? ఎవరో ఒకరాజకుమార్తె...ఆమెను, ఆమెయిద్దరుచెల్లెళ్లను, ఎవడో ఎత్తుకొని పోతున్నాడు....ఆమె తప్పించుకొని ఒకముసలివాని చాటుకు పోతున్నది...ముసలివాడు పడుచువానితో యుద్ధము చేస్తున్నాడు...ఏమో, ఆమె వేషము మార్చినది, కాషాయవస్త్రము ధరించింది...పాపమేమి చెప్పమా,

చితిపేర్చుకొని అగ్నిలో పడడానికి ప్రయత్ని-
స్తున్నది....ఏమి వింత? ఆరాజకుమార్తె నేనయినట్లు
కనబడుతున్నదేమిటి?...ఇదేదో కల. అబ్బా, ఈకల
చాలా భయంకరంగా ఉంది. మేలుకోవలెను...మెలకువ
రాదే...ఇంకా, అదే దృశ్యము...నేనేనా ఆరాజ
కుమార్తె?...

దేవదూత: అవును.

శిఖండి: ఇదెవరో ఈవ్యక్తి ఎదురుగా 'అవు'నంటున్నది. ఇది కూడా కలయేనా?

దేవదూత: ఇది కలకాదు.

శిఖండి: ఇది కలకాదూ? ఇంకా కలలోని పిల్లనుగానే ఉన్నట్లుందే?

దేవదూత: అవును, ఆకలలోని పిల్లవే నీవు.

శిఖండి: ఆపిల్ల పేరు.

దేవదూత: అంబ.

శిఖండి: నాపేరు శిఖండే.

దేవదూత: అంబే శిఖండి.

శిఖండి: అంబే శిఖండి, శిఖండే అంబ ; శిఖండే అంబ...అంబ అంబ...శిఖండి...అంబ...ఏమో, నిజమయినట్లే కనబడుతున్నది.

దేవదూత: నిజమే. శిఖండీ; నీకు పూర్వజన్మస్మృతి కలిగినది. నీవు ధన్యాత్ముడవు.

శిఖండి: ధన్యాత్ము'డ'వా ? ధన్యాత్మ'రాల'వని కాబోలు నీ అభిప్రాయము,

దేవదూత: అంబా! శిఖండీ! నీవు దృఢసంకల్పురాలవు. నీది కారణ జన్మము. నీవొక మహాత్కార్యము చేయడానికి అంబ తనువు విడిచి, శిఖండి దేహమును పొందినావు. నీవు పేర్చుకొన్న చితిలో ఆశరీరము నశించినది. కాని, నీ సంకల్పముమాత్రము ఆత్మనంటుకొని వచ్చింది.

శిఖండి: సంకల్పమా ? నాకెట్టి సంకల్పమున్ను లేదే ?

దేవదూత: కొత్తపరిస్థితులు, కొత్తసంబంధముల మధ్య, అది నివురు గప్పిన నిప్పువలె అణగియున్నది. దానిని ప్రజ్వలింపజేసే

అవకాశము సంభవిస్తే అది బయటపడుతుంది. లేకపోతే అట్లే క్షయమైపోతుంది.

శిఖండి: ఏమో, ఎంత వెదకుకొన్నా, నాకు సంకల్పమనేది ఉన్నట్లే తోచలేను...ఆఁ...ఆఁ...ఉండు, ఉండు...అనాచెల్లె-ళ్ళను నన్ను ఎత్తుకొనిపోయినవాడు...ఇంకా...

దేవదూత: అవును, అతడే.

శిఖండి: ఎవరతడు ?

దేవదూత: భీష్ముడు.

శిఖండి: భీష్ముడు...భీష్ముడు...భీష్ముడు... ఏమిది ? ఆ పేరు విన్నంతనే నాకేమో అరకాలిమంట తలకెక్కినట్లవుతున్నది. భీష్ముడు కురుకులపితామహుడు. ధర్మాత్ముడని ప్రసిద్ధి పొందినాడు.. అతనిమీద నాకీకోప మేలపుట్టవలెనో !

దేవదూత: నీకాతడుచేసిన అవమానమువల్ల.

శిఖండి: అవును...అవును...అవమానము...అవమా...నించినాడు నన్నుకాదు. అంబను...నన్నే...

దేవదూత: నిన్నే. నీవాతని సాధించడముకోసము పుట్టినావు.

శిఖండి; సాధిం . . చ . . డము ! సాధిస్తాను. . . . ఎట్లు ? ఆడదాననే.

దేవదూత: మగవాడ వౌతావు

శిఖండి: నేనూ ? మగవాడ నౌతానూ ?. . . మగవాడనయి ? అతనిని చంపవలెనా ?

దేవదూత: నీవు చంపలేవు. చంపేవానికి సహాయముచేస్తావు.

శిఖండి: చంపేవానికి ? ఎవరాతనిని చంపేవాడు ?

దేవదూత: అర్జునుడు.

శిఖండి: అర్జునుడూ ? పాండవమధ్యముడూ ? అతడు భీష్మునికి ముఖ్య ప్రియశిష్యుడే ?

దేవదూత: ప్రియశిష్యుడయితే నేమి ? పరశురామునికి భీష్ముడు ముఖ్య ప్రియశిష్యుడు కాడూ !

శిఖండి: ప–ర–శు–రాముడు ? భీ–ష్మ–డు ? ఊం.

దేవదూత: శిఖండీ ! నీసంకల్పము బయలుపడినదా ? నేనువచ్చినపని అయినది. పోతాను, (పోతున్నాడు.)

శిఖండి: ఓరూపమా, నిలబడు,—నిలబడు, ఏమి గాలిలో మేఘము విరిసినట్లు మాయమైపోయినది! నాకు పిచ్చియెత్తినట్లవుతున్నది. (జుట్టుపీకుకొంటూ) అబ్బా! ఏమో, చీకాకెత్తుతున్నది. అంధకారము...గాఢాంధకారము. చేతిలో ఈ త్రాడేమిటి?...ఉరిపోసుకొనవలె ననుకొన్నాను... ఇంకా బ్రతికి ఉండవలెనా?...మగవాడనౌతాను... ఎట్లు కావడమో ఆ వ్యక్తి నడుగలేదే! అదికూడా చెప్పలేదే!...ఇదంతా భ్రమవిలసితము...అవును భ్రమే. అయ్యయ్యో! నాలో ఏమోతాపమెత్తుతున్నది. సమస్త నాడులున్ను నులుచుకొనిపోయి క్రొత్త స్థానములను రూపములను పొందుతున్నట్లున్నది. అయ్యో! భరించలేను! భరించలేను!—ఈ తాడే నాకుదిక్కు—. (మెడకు తగిలించుకొంటున్నది.) (తెర)

## రంగము 3.

[ ప్రవేశము : కుబేరుడు, సేవకుడు. ]

కుబేరుడు. ఎవరో రాత్రిపూటవచ్చి నావనములోని పండ్లను పువ్వులను దొంగిలిస్తున్నారట. సేవకులు ప్రమత్తులుగా ఉంటే,

ఇంత చక్కనితోట పాడవడానికెంతకాలము పట్టుతుంది? ఈ ఉద్యానవనమునకు తోటమాలి యెవడురా?

సేవకుడు: స్థూలకర్ణుడు, దేవరా!

కుబేరుడు: ఓహో, వాడా? పాపము వానిభార్య ఈమధ్య కాలముచేసిందట. ఆదుఃఖములో మునిగిఉండడముచేత తోటను చూడడములో కొంచెము ఉపేక్షచేస్తున్నాడు కాబోలు.

సేవకుడు: అయ్యో, దేవరవారింకా రాత్రిబేరములోనే ఉన్నారు. వానికి పెండ్లాము పోతే, మరి పెండ్లాలేలేరా?

కుబేరుడు: ఏమీ, ఇదా ఇక్కడ జరుగుతున్నది?

సేవకుడు: దేవరవారు ఇనుపపెట్టెవద్ద కూర్చొని సంచులు లెక్కపెట్టడముతోనే సరిపోతే, వీరంతా మరేమిచేస్తారు? (తెరలో: "పనికాగానే తిరిగివస్తావుకదూ? నాకొంప తీయకుమా." "నామాటనమ్ము. ఒక్కక్షణమయినా ఉండను.")

కుబేరుడు: ఎవరామాటలు?

సేవకుడు: ఇంకెవరు? మన స్థూలకర్ణులవారే. ఎవరో ప్రియురాలి నిప్పుడే పంపివేస్తున్నారు.

కుబేరుడు: ఏమి వీనిసాహసము ? ఏమి వీనిపొగరు ? ఎంత అవమానము ! ఎంత పరువుతక్కువ ! పోయి వానిని పెడరెక్కలువిరిచికట్టి ఇక్కడికి తీసుకరా. ఆపోతూఉన్న దెవర్తో దానినికూడా బంధించితీసుకరా!

సేవకుడు: చిత్తము దేవరా ! (పోతున్నాడు)

కుబేరుడు: సేవకులపై కనుగలిగి ఉండకపోతే ఇటువంటి అవకార్యాలు జరుగుతూఉంటవి.

(తెరలో) సేవకుడు: దేవరా, ఇక్కడ స్థూలకర్ణుడు లేడు.

కుబేరుడు: మరెవ్వ రాఉన్నది ?

(తెరలో) సేవకుడు: స్థూలకర్ణమ్మగారు!

కుబేరుడు: ఇదేమివింత ? ఆరెండో వారెవరు ?

(తెరలో) సేవకుడు: అదిగో, అదిగో, పోయె, పోయె! తప్పించుకొని పోయె !

కుబేరుడు: ఎవరో అనవాలు పట్టినావా ?

(తెరలో) సేవకుడు: మొగమాప్రక్కకుంది, పోల్తి తగలలేదు. ఎవడో మగవాడు.

కుబేరుడు: సరే, స్థూలకర్ణుడి నీడ్చుకరండి.

(తెరలో) రానంటుందిదేవరా! రాఅమ్మా, స్థూలకర్ణమ్మా. దేవరవారి సెలవయింది...ఇదిగో, వెనుకకు ఇగ్గుకుంటుంది దేవరా!

కుబేరుడు: ఈడ్చుకరండి.

(సేవకులు స్త్రీరూపముతో ఉన్న స్థూలకర్ణునితో ప్రవేశిస్తారు. స్థూలకర్ణుడు మొగము చేతులతో కప్పుకొని వేగముగావచ్చి కుబేరుని కాళ్ళమీద పడతాడు.)

కుబేరుడు: (నవ్వుతూ) ఏమి స్థూలకర్ణా, ఏమిటీవేషము ?

స్థూల: నాకర్మము దేవరా! నన్ను రక్షించాలి.

కుబేరుడు: ఏమిది? ఏమిటో చెప్పు.

స్థూల: ఒకరి ఊసులలోనికి పోయినందుకు ఫలము దేవరా, ఇది!

కుబేరుడు: ఏమి జరిగినది?

స్థూల: ఎవరో ఒకాయమ్మవచ్చి ఈచెట్టుమీద ఉరిపోసుకొనబోతున్నది దేవరా! ఆయమ్మను రక్షింపబోతే, నాకీగతి పట్టించింది, దేవరా! (ఏడుస్తాడు.)

కుబేరుడు: ఆయమ్మ ఏమిచేసింది?

స్థూల: నక్కవినయాలు చూపి, దొంగయేడుపులు ఏడ్చి, నాకు మగతనముతో కొంచెము పనిఉంది, దయఉంచి, నీమగతనం నాకిచ్చి. అందాకా నాఆడతనం నీవు తీసుకో. ఇప్పుడేవచ్చి నీమగతనం నీకిచ్చివేస్తానని మోసంచేసి, నాకు గాజులు తొడిగించింది, దేవరా, (ఏడుస్తున్నాడు.)

కుబేరుడు: మంచిపని చేసింది. అక్కరలేని పనులలో నిన్నెవరు కలుగజేసుకొమ్మన్నారు? చచ్చేవరకు నీకీరూపంతప్పదు, పో. లేనిపోని పనులకుపోతూ నావనమంతా పాడుచేయ దలచుకొన్నావా? పో, పో.

స్థూల: దేవరా, రక్షించుదేవరా, నావల్ల తప్పొచ్చింది దేవరా, ఈ ఒక్కతప్పు క్షమించాలి దేవరా.

కుబేరుడు: నామాట తప్పను. ఇకనైనా తోటను బాగాచూస్తూ-ఉండు. (పోతున్నాడు)

స్థూల: (కుబేరుని వెంట బడుతూ) దేవరా, క్షమించు దేవరా, బుద్ధివచ్చింది దేవరా!

(నిష్క్రమిస్తారు.)

---

# షష్ఠాంకము.

## రంగము ౧.

[ రెండు పిశాచములు ప్రవేశము. ]

మొదటి: ఏమి మారమ్మా! బహుకాలదర్శనం. ఆనాడు భీష్మ సాళ్వరాజుల యుద్ధమయిననాటినుంచీ కనబడకుండా పోయినావు.

రెండో: అవును పోలమ్మా, ఈ మధ్య మనదినాలు బాగులేవు. ఒక్కగొడ్డయినా పడితేనా? ఎక్కడయినా ఒక అనాథప్రేత జతపడితే, అక్కడనున్న మనబంధువులకే చాలక పోతున్నది. ఏదయినా పెద్దఒడుపు రావాలి, అప్పుడు మనకడుపు నిండాలి.

మొదటి: నీవు చూచినంతమట్టుకు, విన్నంతమట్టుకు, ఈమధ్య మన పుణ్యామేమయినా పుచ్చుతుందా?

రెండో: పుచ్చేటట్లే ఉంది. పాండవు లజ్ఞాతవాసమునుంచి తిరిగి వచ్చినారట.

మొదటి: వచ్చినారూ? సంతోషమే. ధృతరాష్ట్రుడు వారిరాజ్యం వారికొప్పచెప్పినాడా?

రెండో: నీకేమి పిచ్చా! పోలమ్మా! గుడ్డిరాజు ఒప్పుకొన్నా, దుష్టచతుష్టయం అతనిమాట సాగనిస్తుందా?

మొదటి: పాపం! అయితే పాండవు లేమిచేయ నిశ్చయించినారు!

రెండో: ఏమినిశ్చయిస్తారు? రాచబిడ్డలుకారూ? అందులో సామాన్యులా? ఈ పదమూడేళ్లలోను ఒక్కొక్కరూ ఎన్నెన్నో దివ్యాస్త్రాలు సంపాదించుకొన్నారట. అందులో అర్జునుడు సింహాపుపిల్ల.

మొదటి: అవును, అతడు శివునికూడా గెలిచి పాశుపతాస్త్రము సంపాదించినాడట. ఈకౌరవులకు పోయేకాలం కాక-పోతే, అన్నదమ్ములుగదా, తమది అధర్మమని తెలుసును గదా, పాండవులు బలవంతులని కూడా తెలుసునుగదా, వారి చేరెడు వారికిచ్చివేసి, కలిసిమెలిసి ఉండకూడదూ? వారే సఖ్యపడితే ఈ కౌరవవంశాన్ని తేరిచూచేవారుంటారూ?

రెండో: వారే సఖ్యపడితే మనకడుపెట్లా నిండడము? సఖ్యము

మాటేమోసున్న. గుడ్డిరాజు ఒప్పుకొంటే, దుర్యోధనుని అభిమానము; దుర్యోధను డొప్పుకొంటే దుశ్శాసనుని పొగరు; వీరందరూ ఒప్పుకొంటే శకునిమామ.

మొ. దటి: అయితే ఏమయింది ?

రెండో: ఏమయిందేమిటి ? సైన్యాలనడకతో భూమి గజ గజ వడకి పోతూఉంటే. కొసన్నా ! కూసన్నా ! పద్దెనిమిది అక్షోహిణీలు; పాండవులవిఏడు, కౌరవులవి పదకొండు. అప్పుడే కురుక్షేత్రం చేరుకొన్నాయి.

మొదటి: ఏమిటీ! నాకు తెలియేలేదూ ! అయితే కురుసైన్యాలకు అధిపతి యెవరు ?

రెండో: ఎవరౌతారు ? తాతగారు భీష్ముడూ.

మొదటి: అయితే ఆనాటిభీష్ము డింకా బ్రతికున్నాడే, మారమ్మా !

రెండో: కాలం కర్మం కూడిరావద్దూ ?

మొదటి: భీష్ముడు ధర్మాత్ముడంటారే ? కౌరవులలో దూరు-కొన్నాడేమి ?

రెండో: ఎవరికూడు తింటే వారిమాట లాడాలి. ధర్మాలూ, గిర్మాలూ పురాణాలలో.

మొదటి: భీష్ముడు కౌరవుల పక్షాన్ని ఉంటే, మరి పాండవులు గెలువగలరా? అతని కెదురుగా నిలబడగలిగేవా డెవడూ పాండవులలో కనబడడే!

రెండో: కృష్ణుడున్నాడు పాండవుల పక్షాన్ని.

మొదటి: ఏమిటీ! కృష్ణుడు భగవంతు డంటారే. భగవంతునికీ ఉన్నదీ, పక్షపాత బుద్ధి? ఆయనొక్కడే చంపివేయ కూడదూ కౌరవులని? ఈయుద్ధమంతా ఎందుకు?

రెండో: కృష్ణుడు యుద్ధము చేయడు.

మొదటి: అయితే పాండవసైన్యాలని నడిపించేదెవరు?

రెండో: అర్జునుడు. కృష్ణుడతనికి సారథి. పాండవులది ధర్మ పక్షముగనుక అపక్షికి నిలిచినాడు.

మొదటి: కృష్ణుడు కత్తిపట్టి స్వయముగా సహాయము చేయకపోతే, అర్జునుడు భీష్ముని గెలువగలడా? నాకేమీ నమ్మకము లేదు. భీష్ముడు అస్త్రసన్యాసముచేసి, అర్జునుని చేత చంపించుకొంటేనే తప్ప, అర్జును డేమిటి, భీష్మునిచంపే-

దేమిటి ? అసలు అర్జునుడు తాతగారిని చంపడానికి సాహసిస్తేకదూ ?

శిండో: ఏమో, ఎట్లా దైవనిర్ణయమయితే అట్లా జరుగుతుంది. అగోడవమనకేల ? యుద్ధభూమిమీద ఏవో నాలుగు శవాలుపడితే, మనము పీకుకొని తినవచ్చును గదా. అదుగో, వీరులు శంఖాలు మ్రోగిస్తున్నారు. యుద్ధ-మారంభమవుతున్నది. పద, మనపని చూచుకొందాము.

(నిష్క్రమిస్తున్నారు.)

## రంగము ౨.

[కృష్ణార్జునుల ప్రవేశము.]

కృష్ణుడు: అర్జునా, మంచి సమయములో తెచ్చిపెట్టినావే! మహా-వీరుడవనుకొంటూ ఉంటే ,ఇదేమి, విల్లు, అమ్ములు విడిచి పెట్టి, ఇట్లా చతికిలబడ్డావు ? ఇది అనార్యజుష్టము అస్వర్గ్యము, అకీర్తికరము. లే, పిచ్చివాడా, ఇదా సమయము ?

అర్జునుడు: కృష్ణా, పూజార్హులైన నాగురువులు భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, నాతాతలు, తండ్రులు, మామలు, బావలు,

అన్నదమ్ములు, ఇతర బంధువులు వీరితో నేనెట్లు యుద్ధ-
ము చేయగలను ? ఇట్టి అధర్మయుద్ధమునుచేసి, వీరినిచంపి
నెత్తురుకూడు తినడముకంటె, బిచ్చమెత్తుకొని బ్రతుక
వచ్చునే !

కృష్ణు: ఓహో, చాలా పెద్దమాటలు నేర్చినావే. నీవెవడవోయి, అర్జునా, వీరిని చంపడానికి ? నిత్యుడు, శాశ్వతుడు, అయిన జీవుని నీవు చంపగలననుకొంటున్నావా ? ఈదేహ-ములు నశ్వరములు, ఆత్మకునాశములేదు. చినిగిపోయిన బట్టను విడిచి, క్రొత్తదానిని తొడుగుకొనేటట్లు, ఆత్మ ప్రాత దేహములను విడిచి క్రొత్తవాటిని ధరిస్తుంది. జీర్ణ వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను కట్టుకొన నిష్టములేనివా డుంటాడా ? నాశనము లేనట్టివాడు మృతిపొందినాడని తలచి యేడ్వడము కంటె అవివేకముంటుందా ? నీవు క్షత్రియుడవు కావూ ? యుద్ధముచేయడము నీధర్మము కాదూ ? ఉత్తమ క్షాత్త్రముగలవాడు గెలిచి రాజ్యము ననుభవించాలి ; లేకపోతే చచ్చి స్వర్గ మనుభవించాలి. నీ విప్పుడు యుద్ధము చేయకపోతే, ఈ కూడినరాజులందరూ ఏమను కొంటారు ? నిన్ను లేవిడీలేపరూ ? నీకపకీర్తి కలుగదూ ? తరువాత అవమానం భరించగలవూ ?

అర్జు: కృష్ణా, అయితే నేను యుద్ధము చేయవలసినదే? ఇది అకార్యము కాదంటావా?

కృష్ణు: కార్యమేమి? అకార్యమేమి? చంపేవాడెవడు, చచ్చేవాడెవడు? ఎవడు చేసుకొన్న కర్మను వాడు ఫలమనుభవింపక తీరుతుందీ? కర్మక్షయము సంపూర్ణముగా అయ్యేవరకూ జీవుడు చస్తూ ఉండవలసినదే, తిరిగీ పుట్టుతూ ఉండవలసినదే.

అర్జు: అయితే కర్మక్షయమయ్యే ఉపాయమున్నదా?

కృష్ణు: అట్లా అడుగు, చెప్పుతాను. బ్రతికి ఉన్నంతకాలమున్నూ ప్రతీవాడూ తనప్రకృతి తన్ను ప్రేరేపించిన కర్మను చేస్తూ ఉండవలసినదే. ఎంతటివాడయినా, ఆ కర్మను చేయకుండా తప్పించుకోలేడు. కాని, ఫలాపేక్ష లేకుండా కర్మమును ఆచరిస్తే, అది క్షయమవుతుంది.

అర్జు: ఫలాపేక్ష లేనిదీ ఎట్టి మందుడయినా ప్రవర్తించడే. రాజ్యానుభవాపేక్ష లేకపోతే, ఈ యుద్ధము నెందుకు చేయవలెను?

కృష్ణు: మందబుద్ధులే ఫలముకోరుతారు. బుద్ధిమంతులు కోరరు.

తమవిధిని తాము నిర్వర్తించి తృప్తిపడతారు. ధర్మపక్షమున యుద్ధము చేయడము క్షత్రియునివిధి. క్షత్రియుడు రాజ్యభోగముల ననుభవించడానికి సృజింపబడలేదు. లోకక్షేమము అతనివశములో ఉంచబడినది. ప్రజలను ధర్మానురక్తులుగా చేసి, అధర్మము నణగద్రొక్కడమే క్షత్రియుని పని.

అర్జు: ధర్మవిషయములో కర్మమేమో, అకర్మమేమో, ఎట్లు తెలుసుకొనడము ?

కృష్ణు: అది చాలా కష్టమైన పని; ఆ విషయములో పండితులు కూడా మోహము పొందుతారు. దానిని తెలుసుకొనడానికి సద్గురూపాసన చేసి, మననము చేసి, పరిప్రశ్నము చేత, సేవచేత, గురువులను సంతోషపెట్టితే వారుపదేశిస్తారు. సత్కర్మము నాచరించడము సామాన్యమైనపని కాదు. దానికి యోగము కావలెను. ఆత్మయజ్ఞము నాచరింపవలెను. తపస్సు చేయవలెను. ఇట్టివి సామాన్యులకు సాధ్యము కాకపోవచ్చును. ఎట్టివాడయినా భక్తిపరుడై, యీశ్వరధ్యానము చేస్తూ, యీశ్వరసంబంధమయిన పనుల నాచరిస్తూ, ఈశ్వరుడే పరముడని తలంచి,

అతనినే ఆశ్రయిస్తే కర్మరహస్యము బోధపడు-తుంది. అర్జునా; నీవు నా శిష్యుడవు, నా సఖుడవు, బావమరదివి. నీమీద వాత్సల్యముచేత ఈ ఉపదేశము చేసినాను.

అర్జు: కృష్ణా, నీకు ప్రపన్నుడనై నాను. నాకింకా ఈమార్గమును ఉపదేశింప ప్రార్థిస్తున్నాను.

కృష్ణ: పార్థా, ఈయుద్ధసమయమందు నీకు వేదాంతోపదేశము చేస్తూ కాలవిలంబముచేయడము మంచిదికాదు. ఇటువిను. నేను భగవంతుడను. ధర్మమునకు హానికలిగి. అధర్మము చెలరేగుతున్నప్పుడెల్ల, నేను వివిధరూపములతో అవత-రించి, ధర్మసంస్థాపనము చేస్తూఉంటాను. లోకమిప్పు డధర్మముతో నిండుకొనిఉన్నది. దాని నడచివేయవలెను. ఆపనిలో నీవేమో ప్రముఖుడవని అనుకొంటున్నావు. నీవట్లు గర్వింపనక్కరలేదు. ఈప్రజాక్షయము కలిగియే తీరవలెను ; నీవందుకు నిమిత్తమాత్రుడవు. లే, యుద్ధానికి లే. నీవు నిలబడు, తక్కినపని నేను చేయిస్తాను.

అర్జు: పుండరీకాక్షా, నాకింకా సంశయము పోలేదు. నాకు

నమ్మకము పుట్టించనిదీ ఈయుద్ధములో పరిశ్రించడము నాకిష్టములేదు.

కృష్ణు: అట్లేమి? అయితే నానిజస్వరూపము చూపిస్తాను, ఇటుంా.
(నిష్క్రమిస్తారు.)

## రంగము 3.

[రెండు పిశాచములు.]

మొదటి: ఏమి మారమ్మా, నీపనేబాగుంది. నీవు కౌరవసైన్యములో దూరినావు. నేనున్న పాండవపక్షములో నాటా, నూటా ఎవడో ఒకడు చస్తున్నాడు. నేటికి తొమ్మిదిదినాలయింది ఈయుద్ధ మారంభమయి. సాధారణంగా గాయాలు తిని కట్లుకట్టుకొనేవారేకాని, మనకు పనికివచ్చే కళేబరా లెక్కువగా పడడములేదు.

రెండో: పోలమ్మా. మాపక్షములోనూఅంతే. ఈతొమ్మిది దినములలోను మొదటిదిన మేమీలేదు గదా. రెండో దినము భానుమంతుడు పడినాడు.

మొదటి: భానుమంతుడెవరు, మారమ్మా?

రెండో: అత డెవరో కళింగరాజు తమ్ముడట. మూడోదినం నాకు ఉపవాసమే. నాలుగోరోజు మాధృష్టద్యుమ్నుడు మా శల్యునికొడుకును చంపినాడు. అయిదు, ఆరు, ఏడో దినాలు శుష్కోపవాసమే, కడుపు వెన్నంటుకుపోయింది. ఎనిమిదో దినం కొంచెము పారణ; భీముని ధర్మమా అంటూ సునాభుడు మొదలయిన కురుకుమారులను చంపి-నాడు. నిన్నటి తొమ్మిదో దినం మాకాహారమేలేదు. ఈదిన మెట్లాఉంటుందో నాఅదృష్టం. అక్కడ నీ అవస్థ ఎట్లున్నదో ?

మొదటి: నీపనే బాగుంది, గుడ్డిలో మెల్ల. ఇన్నాళ్లకు మొన్న ఎనిమిదోనాడుమాత్రం ఒక్క ఇరావంతుడు చచ్చినాడు. వాని ఒక్కనికోసము అర్జునుడు ఏడ్చినదేడుపు కాదు.

రెండో: ఎవరీ ఇరావంతుడు ?

మొదటి: అర్జునుని కొడుకు; తీర్థయాత్రకుపోయినప్పుడు ఉలూపికి పుట్టినవాడు.

రెండో: ఓస్, ఈ ఉబ్బరసంతా నానికేనా అంత ఏడుపు ?

మొదటి. మారమ్మా, నాకు మరేమీలేదు. నిన్న నీవలెనే ఉప-వాసము.

రెండో: అయితే పోలమ్మా, మీ అర్జును డంతగట్టివాడావేమి? భీష్ముడంతటివానిని మూడుచెరువులనీళ్ళు త్రాగిస్తున్నాడు.

మొదటి: ఇందులో మాఅర్జునుని ప్రభావమేమీలేను. మాయదారి కృష్ణుడులేడూ?

రెండో: ఏమిచేసినాడేమిటి!

మొదటి: కృష్ణుడంటే సామాన్యుడా? అంతటిగాజనీతి తెలిసిన వాడేడీ? యుద్ధము కాకముందే ధర్మరాజును భీష్ముని వద్దకు పంపినాడు. ధర్మరాజు పాదచారిగా పోయి, 'తాతా, యుద్ధ మారంభిస్తున్నాము. మాకు జయము కలిగేటట్లు దీవించు' అని నమస్కరించినాడు. మరేముంది? దానితో భీష్మునికి సగముబలముపోయింది. 'నాయనా, నీవిప్పుడురావడము మంచిపని చేసినావు. నీవు గెలుస్తావులే, పో' అని పంపివేసినాడు.

రెండో: అమ్మా! ఎంతమోసము జరిగినది! అందుకోసమే పాండవులలో ఎవరూ ఇంతవరకూ చావలేను. అయితే, ఈ పాటికి భీష్ముడు పడవలసినదే!

మొదటి: భీష్ముడు వీళ్ళచేతపడేవాడుకాడు. మన అంబ...... తెలియదూ...శిఖండి...

రెండో: అవునవును. అతడే భీష్ముని చంపుతాడట.

మొదటి: చంపుతాడట ఏమిటి? ధర్మరాజు తిరిగీ ఈతెల్లవారు జామున భీష్మునివద్దకుపోయి, "తాతా, నిన్ను జయించ లేకుండా ఉన్నాము. మాకు జయము కలుగుతుందని మొదటనే దీవించినావు. నీదీవన వృథాచేసుకొంటావా? తొమ్మిదిదినాలు చెలరేగి మాబలములను చెల్లాచెదరు చేసినావు. అంతకంతకు మాబలము తరిగిపోతున్నది. నీవు చచ్చేఉపాయము చెప్పకపోతే మాకేమిదారి?" అని మొరపెట్టుకొన్నాడట. భీష్ముడదివిని "మీరు భయపడ కండి. నేని అవతారం చాలించవలసినదినం వచ్చింది. అర్జునుడు శిఖండిని ఎదురుగాపెట్టుకొని నామీద బాణా-లు ప్రయోగించవలెనని చెప్పు. శిఖండి నాకెదురుగా ఉన్నంతసేపు నేను బాణమువేయను," అని చెప్పినాడట.

రెండో: ఎంతమోసం? ఎంతమోసం?

మొదటి: మోసమేమిటి? దైవమేర్పరచినదాని నెవరుతప్పించగలరు!

రెండో: అయితే ఈదినం భీష్ముడు పడతాడన్నమాటే?

మొదటి: పడవచ్చు. అతడుపోతే మనకు మరి భయములేదు. రా, ఏమవుతుందోచూదాము.

రెండో: పద. (నిష్క్రమిస్తారు.)

## రంగము ౪.

[కృష్ణార్జునుల ప్రవేశము]

అర్జు: బావా, మంచివాడవేలే! నిన్ను నమ్మికొన్నందుకు బాగా చేస్తున్నావు! నేటికి తొమ్మిది దినములైనది. నానాటికీ భీష్మునిబలము హెచ్చిపోతున్నది. నాకీయుద్ధమక్కర లేదో అంటే వేదాంతంమాటలు చెప్పి, ఇంద్రజాలము చేసి, నన్నుఒప్పించి ఇందులోనికి దింపినావు. నీసహాయం నాకేమీ కనిపించలేదు.

కృష్ణ: బావా, మహాగొప్పయోధుడవులే. నేను సహాయంచేసి నాచక్రముతో భీష్ముని చంపుతే, ఓ! నేనే చంపినానని భుజాలు ఇటూఅటూ చూచుకోవా లనుకొన్నావా? నేను చంపుతే నీగొప్పయేముంది?

అర్జు: గొప్పమాట తరువాత చూచుకోవచ్చునుగాని, ఈభీష్ముడు ముందుపడితే, తక్కినవారిమాట చూచుకో వచ్చును. నేరకపోయి నిన్ను కోరుకొన్నాను. ఆనాడు పదివేల మంది నారాయణగోపాలసైన్యమునే కోరుకొని ఉంటే, వారు స్వయముగా యుద్ధముచేసి ఉందురు. ఈపాటికి

యుద్ధమే ముగిసిఉండును. చేతిలో ఒక చక్రము పట్టుకొని చక్కగా కదలకుండా, మెదలకుండా, రథము మీద కూర్చొని, నేను దెబ్బలు తింటూఉంటే, ముసిముసి నవ్వులు నవ్వుతూ ఉంటావు. ఆనవ్వులు చూస్తూఉంటే నాకు ఒళ్ళు మండిపోతూఉంటుంది. యుద్ధములో ఒక మూల ప్రాణాలుపోతూఉంటే, అదా సమయము నీకు నవ్వడానికి ?

కృష్ణు: బావా, నన్ను సహాయముకోరుకొని చాలా తప్పుపని చేసినావు. మొదటనే కోరుకోలేకపోయినావా నారా-యణసైన్యమును? పోనీ, ఇప్పుడు మించిపోయినదేముంది ? నే నాపక్కకు పోతాను, ఆ సైన్యాన్ని నీ పక్కకు పంపించేస్తానులే. ఏం, అట్లాచేయనా ?

అర్జు: నీపుణ్యముంటుంది బావోయ్ ! ఎప్పుడయినా అటువంటి పని చేసేవు ! నీసంగతిచూస్తే నాకు అత్భుతంగా కనబడు తున్నది. గడియకు బెదిరిస్తావు ; గడియకు పొంగవేస్తావు, ఒకప్పుడు 'లే' అంటావు, ఒకప్పుడు 'కూర్చో' అంటావు, ఒకప్పుడుశౌర్యముపుట్టిస్తావు. ఒకప్పుడు పిరికిమందు పోస్తావు. నీచర్య అగమ్యగోచరంగా ఉంది. నన్నొక బంతివలె ఆడిస్తున్నావే !

కృష్ణు: అబ్బో, నువ్వు బంతివలె ఆడేవాడవే! నీవు సామాన్యు-డవా, బావా! ఈశ్వరుడినికూడాజయించి అమోఘాస్త్రమును సంపాదించినావు.

అర్జు: చాలులే నీమాయమాటలు! బలే భీష్ముని చంపేవానివలె చక్రముపట్టుకొని అతనిమీది కురికినదే ఉరకడం. ఒక్క-సారికాదు, రెండుసారులు. భీష్ముడు పడె, పడె, అని ఎక్కడచూచినా హాహాకారాలే. తీరా చూడబోతే పుస్సుమనిపించినావు. ఏమిటి బావా నీసంగతి, నాకు తెలియకుండా ఉంది, కొంచెము చెప్పు.

కృష్ణు: నాసంగతా! నీకు తెలియకపోతే, మరెవరికి తెలుస్తుంది. నేనుచంపి, బావమొగము చిన్నబుచ్చడమెందుకని ఊరుకొన్నాను.

అర్జు: చిన్నబోతే పోయినాను, చక్రము వదలలేకపోయినావా?

కృష్ణు: నీవేమిచేయవలెననుకొన్నావు? ఉలూపి దగ్గరో, చిత్రాం-గద దగ్గరో, సరసాలాడుతూ ఉండిపోలేకపోయినావా?

అర్జు: గోపికావల్లభులు నన్నెత్తిపొడువ నక్కరలేదు.

కృష్ణు: పోనీ, ఉత్తరకు నాట్యం నేర్పడము పూర్తిచేసుకొనిరాలేక పోయినావా?

అర్జు: కృష్ణా, అయితే హాస్యంమాటలేనా, మాకేదయినా దారి చూపిస్తావా?

కృష్ణు: అందుకే నిన్నీవంకకు తీసుకొనివచ్చినది. అదిగో, శిఖండి శిబిరము. అతడున్ను యుద్ధసన్నద్ధుడై ఈ వంకకే వస్తున్నాడు.

అర్జు: శిఖండితో మనకేమి ప్రయోజనము?

కృష్ణు: నీవతని సహాయమును కోరుకోవాలి.

అర్జు: మంచిమాటే! వసుదేవుడుపోయి గాడిదకాళ్ళు పట్టుకొన్నట్లున్నది. ఈపేడివానిని నేను సహాయం కోరాలా?

కృష్ణు: ఓ! నీవు చాలా మీసంగల మగవాడవులే! బృహ...

అర్జు: చాలు, బావా, ఇంక ఊరుకో. నీకుమాత్రమేదీమీసం?

కృష్ణు: ముగ్గురినీ కూర్చినాడురా, ముండదైవమన్నట్లు, మనముగ్గు-రమూ ఒకదగ్గర చేరవలసిన సమయము వచ్చింది. బిఱ్ఱబిగియక నేనుచెప్పినట్లుచెయ్యి. లేకపోతే మీపనిఇంతే, భీష్ముడు మరొకళ్ళ విధాన కూలడు.

అర్జు: అయితే భీష్ముని కూల్చిన గౌరవం ఆశిఖండికా ఇస్తావు?

కృష్ణు: ఏమిచేయటం! నేనా యుద్ధముచేయనని మాటయిచ్చినాను. నీవా. అతనిని ఎదిరించి చంపలేవు. మూడోవానిసహాయము లేనిదే భీష్ము డెట్లాపడతాడు?

అర్జు: మన కిద్దరికీ సాధ్యముకానిపని, ఈ శిఖండికా సాధ్యమవుతుంది?

కృష్ణు: గొడ్డళ్లకు సాధ్యముకానిపనులు కొన్ని సూదులకే సాధ్యమవుతవి. గౌరవముమాట చూచుకొందాములే. కావలిస్తే ముగ్గురమున్నూ పంచుకొందాము.

అర్జు: అయితే ఏమిచేయ దలచినావు?

కృష్ణు: ఏమీలేదు, శిఖండిని నీముందుంచి, నీచేత భీష్ముని కొట్టించదలచినాను.

అర్జు. భీష్ముడు శిఖండిమొగము చూడడే!

కృష్ణు: అదేమరి! అసందుచూచుకొని నీవుకొట్టాలి.

అర్జు: ఛీ, ఛీ! ఇది ఆడపనికాదూ?

కృష్ణు: అయితే శిఖండిని పిలువనులే! నీ మగతనము చూపించే గెలుచుకో.

అర్జు: కృష్ణా, నీతో ఎటుపోయినా చిక్కేగానే ఉన్నది.

[శిఖండి ప్రవేశించును.]

కృష్ణు: తమ్ముడా, శిఖండీ, సుఖమా?

శిఖండి: (తనలో) ఏమిది, శ్రీకృష్ణుడు నన్నింతవాత్సల్యముతో పిలుస్తున్నాడు? తమ్ముడా, అట. (ప్రకాశముగా) కృష్ణా, నమస్కారము. నీదయవల్ల ఇప్పటికి సుఖమే.

కృష్ణు: అర్జునా, వీరెవరో నీకు తెలుసునుకదూ. వీరు ద్రుపదమహారాజుల పుత్రులు. శిఖండి అనే సుగృహీత నామ ధేయులు. నీకు బంధువులు, బావమరదివరుస, నావలెనే!

అర్జు: చిత్తము, చిరకాలమునుంచిన్ని వారి దర్శనము నాకు కలుగలేదు. వారి పరాక్రమాతిశయమునుగూర్చిమాత్రము వీరలోకములో ప్రఖ్యాతికలదు, తమ పరాక్రమమువలెనే.

శిఖండి: నేను తమపొగడ్తకు పాత్రుడనుకాను. తమ యశస్సు నన్ను యుద్ధభూమి కాకర్షించినది. ఉడుతభక్తిగా తమ ధర్మసంస్థాపనకార్యములో సాయపడడానికి వచ్చినాను.

కృష్ణ: శిఖండిగారూ, తమవల్ల పాండవులకు కావలసినకార్యము సామాన్యమయినదికాదు. ఈ కౌరవసేనకు మూలవిరాట్టయిన భీష్ముడు తమమూలముగా పడవలసిఉన్నది. అది దైవనిర్ణయము.

శిఖండి; అమ్మో, భీష్ముడే! అయితే నన్నుతనియెదుట పెట్టదలచినారేమిటి?

కృష్ణ: తమకు భయమా?

శిఖండి. నాకు భయమనికాదు. తమబోటి పెద్దలందరూ ఉంటూ ఉంటే, ఆగౌరవమునకు నేనాసించడము భావ్యముకాదని అన్నాను.

కృష్ణ: పెద్దలూ? ఈపనికి పెద్దలేమి, పిన్నలేమి? దేవునికార్యమునకందరూపెద్దలే.

శిఖండి: తామట్లు సెలవీయకూడదు. అర్జునులవారంతటివారు సాధించవలసినపనికి నేనున్నుతగుదునమ్మా అని పూనుకొనడము హాస్యాస్పదముకాదూ? ఎన్నో యుద్ధాలలో, ఎందరో మహావీరుల బాణప్రహారములచేత కాయలుకాచినది భీష్ముని శరీరము. అతనిమీద నేను బాణాలుప్రయోగిస్తే ఏనుగు ఒంటిమీద చీమప్రాకినట్లయినా కాదు.

కృష్ణ: తామట్లనుకోకూడదు. ఆచీమకూడా ఏనుగుచెవిలోదూరి ఎంతపనిఅయినా చేయగలదు.

అర్జు: కృష్ణా, శిఖండిబావగారు ఎట్లయినా తప్పించుకోనజూస్తు-న్నారు. వారి సహాయము లేకపోతే మనమొక అడుగయినా కదలగలమా?

కృష్ణ: శిఖండిగారు తప్పించుకొంటారా? వారికి పంతముపుట్టక పోవలెనుగాని, పుట్టితే బ్రహ్మాదులుదిగిరావాలి. వారేమి నీవలె...

అర్జు: ఆఁహాఁ. అదికాదు నేనన్నమాట.

కృష్ణ: అర్జునా, నీకు శిఖండులవారి పూర్వచరిత్రము తెలియదు. స్వానుభవముమీద వారిని గురించి ఒక చిన్నకథ చెప్పు-తాను విను. స్వల్పవిషయముగనుక వారికి జ్ఞాపకముండక పోవచ్చును.

అర్జు: సెలవీయవలెను.

కృష్ణ: వీరు చిన్ననాడొకసారి అడవికి వేటకుపోయినారు. అక్కడ ఒక ఆవుదూడను పులి యెత్తుకొనిపోయినది. అప్పుడా గోవు దుఃఖముతో 'అంబా, అంబా' అని...

శిఖండి: (కృష్ణుని కాళ్ళమీదపడి) కృష్ణా, జగన్నివాసా, సర్వాంతర్యామివైన నీకు తెలియని రహస్యములుంటవా? నాకు స్మృతివచ్చినది. నన్నేమిచేయుమంటే దానిని చేయడానికి సిద్ధముగా ఉన్నాను.

కృష్ణు: చూస్తివా, అర్జునా, అవు 'అంబా' అంటే శిఖండి ఉలికి పడతాడు. ఆయన సాధుగోబ్రాహ్మణరక్షణమందు బద్ధకంకణుడు, నీవలెనే. ఆనాడు నీవు తీర్థయాత్రకు పోయినది బ్రాహ్మణగోరక్షణముకోసమేకదూ. అట్టిబుద్ధి ఉండడమఖిలాభీష్టప్రదము. ఒక గోవును రక్షిస్తేచూడు, నీకు ఇరావంతుడు, బభ్రువాహనుడు, అభిమన్యుడు,— వరుసతురుపులు. ఒకడుకాదు, ముగ్గురు. మహాయోధులు. మహానుభావుడవు, నలుగురిగా మారినావు.

అర్జు: చాలులే, కృష్ణా, నీహాస్యాలు. అదిగో, భీష్ముని జ్యాటంకృతి కర్ణవిదారణముగా వినబడుతున్నది.

కృష్ణ: కర్ణవిదారణ మవుతుందిలే. ఇప్పటినుంచీ అది తలచుకోనడమెందుకు? ఈభీష్మఘట్టము దాటితే...

శిఖండి: అది యెంతపని? దానికి నేనున్నాను.

కృష్ణు: అదీ! అట్లనవలెను. ఏదీ, అర్జునా, అటువంటి దొక్క మాట! నీనోటినుంచి? మొదటినుంచీ 'నేను యుద్ధము చేయలేను, నావల్లకాదు'—ఒకటేధోరణి. శిఖండి అయినా, మగవాడంటే అతడేమగవాడు.

శిఖండి: అయితే నేను చేయవలసిన పని ఏమిటో చెప్పండి.

కృష్ణు: ఆపాటి ధైర్యముతో అర్జునునిముందు నిలబడితేచాలు. ఆతరువాత ఈనాట్యాచార్యునిచేత గజ్జెకట్టిస్తాను. భుజము మీద చేయివేసి నిలబడడానికి నీవు కొంచెము ఊత, అంతే...అదిగో, భీష్ముడు దగ్గర పడినాడు. ఏదీ, శిఖండీ, నీచేతిలో విల్లేది? అయ్యో, క్రిందికి జారవిడిచినావేమిటి? ఇదిగో పట్టుకో, ఇవిగో బాణాలు, నీవు నేర్చినకొద్దీ ప్రయోగిస్తూఉండు. ప్రయోగించడానికిష్టము లేకపోతే, నారి మ్రోగిస్తూఉండు, ఆపాటిచాలులే.

శిఖండి: నేనంత పిరికివాడ ననుకొన్నారా?

కృష్ణు: నీవు పిరికివాడవని నేనంటినా? కాని, కొట్టూ? అర్జునుడు కొట్టుతూ ఉన్నప్పుడు అతని బాణాలతో నీవికూడా తగులుతూ ఉండాలి. ఇదిగో ఇక్కడ నిలుచో. (అర్జునుని ముందు నిలబెట్టుతున్నాడు.) అర్జునా, నీవేమి

చేయవలెనో తెలుసునా? నీతలను...ఇతని తలవెనుక... దాచుకోవాలి...ఇట్లా!...నీ మొగము మాత్రము భీష్మునికి కనబడనివ్వకూ!...ఏదీ నీ గాండీవము? చేతిలోనే ఉన్నదా, జారిపోయినదా?...అబ్బా, ఎంతబరువుగా ఉన్నది! బావా! నీవు కాబట్టి దీనిని మోయగలుగుతున్నావు. ఊఁ, పట్టుకో. నీఅమ్ములపొదులు? ఆఁ, బాగుంది, అక్షయతూణీరాలేనా? అమ్ము లయిపోతే, మధ్యరంగములో ఇంటికి పసుగత్తి తెచ్చేవారెవరూ ఉండరు సుమా...ఆఁ, అద్దీ! అట్లా నిలబడాలి!... ఇదిగో, నీవింటిని శిఖండి చెవిదగ్గరగా పెట్టి...

అర్జు: నాకు తెలుసునులే. ఏమిటిది, పిల్లవానికి చెప్పినట్లు చెప్పుతున్నావు!

కృష్ణు: తెలుస్తేసరే. ఆపౌరుషమే మీబావమరదుల కిద్దరికీ పుట్టుతుందా, లేదా, అనిచూస్తున్నాను.

శిఖండి: (వెనుకకు తలతిప్పి) మాకు చెప్పనక్కరలేదు. మేము చూచుకొంటాము.

కృష్ణు: చూచుకొంటావుగాని, ఇదిగో శిఖండీ, తలమాత్రం వెనుకకు త్రిప్పకు, భీష్ముడు తీసిపెట్టికొట్టుతాడు. భీష్ముడు

పడేవరకు ముందుచూపే, తెలిసిందా? వెనుకచూపు, మీదిచూపు, తరువాత చూచుకోవచ్చును.

శిఖండి: అబ్బా! ఎప్పుడూ ఇట్లాగే మెడ కదల్చకుండా ఉండడమంటే కష్టము.

కృష్ణ: ఏమిచేయనుమరీ? ఒక్కక్షణము. ఏదీ, అర్జునా, చూదాము, ఒక్కబాణము, వదలు. భీష్మునికి నమస్కారము చెయ్యి. (అర్జునుడు బాణము వదలుతున్నాడు) బలే, బలే! అబ్బా! చెవులు గుంయిమనిపోయినాయోయ్.

శిఖండి: నాకు చెవుడే వచ్చింది.

కృష్ణ: చెవుడువస్తే మంచిదేలే, మరి వినబడదు. పదండి, భీష్మునికి ఎదురుపడదాము. (పరిక్రమిస్తారు.)

[ప్రవేశము: భీష్ముడు.]

భీష్మ: ఓహో కౌరవయోధులారా! భయపడతారేమి? ధార్తరాష్ట్రులారా! నన్ను చుట్టుకొని ఉండండి. ద్రోణా! నాకుడిప్రైపుననుండు. అశ్వత్థామా! నా ఎడమప్రైపున నిలుచో. దుర్యోధనా! కృప కృతవర్మ భగదత్త పురస్సరుడవై సేనామధ్యమం దుండు. బృహద్బల కాంభోజ ముఖ్యభూపతులారా! దుర్యోధనుని కాచుకొని

ఉండండి. త్రిగర్తులారా! మీరు మహారాజున కావల ప్రక్క కాచిఉండండి. ఇదిగో నేను సేనాముఖమునకు పోతున్నాను. అర్జునుడు సామాన్యుడు కాడు. నేడతనికి బలము హెచ్చయినట్లు కనబడుతున్నది. ధర్మరాజు మొగముమీద నేడు కోపము కనబడుతున్నది. పోరు ఘోరము కాగలదు. యోధులారా! తడబడకుండా మీమీ స్థానములలో నిలబడి యుద్ధముచేస్తూ ఉండండి.

(పరిక్రమిస్తాడు.)

[ప్రవేశము: కృష్ణార్జున శిఖండులు, మునుపటివలె.]

కృష్ణ: అర్జునా! చూస్తివా, భీష్ముని? అతడుపన్నిన మోహారము దుర్భేద్యముగా ఉంది. అతనిచేరువగా ఎట్లుపోతావో!

అర్జు: అతనికి చేరువగా తీసుకొనిపోవడము నీపని. బాణములు వదలడము నాపని.

శిఖండి: భీష్ముడు బాణములు వేయకుండాచేయడము నాపని.

[భీష్ముడు ప్రవేశము]

భీష్మ: అర్జునా! నీనమస్కారబాణములను మెచ్చినాను. ఇవిగో నా ఆశీర్వచనబాణములు.

(అర్జునుని తలపైగా బాణములు వదలుతున్నాడు.)

అర్జు: గురువరా, శిష్యుడు ధన్యుడయినాడు.

శిఖండి: తాతగారూ, నా బాణములు కొంచెము రుచిచూడరూ ?

భీష్మ: ఓహో! నీవున్నవ స్త్రివా? అర్జునునియందు చేరితివా?

శిఖండి: చిత్తము, తమ అమోఘాశీర్వచనమువల్ల.

భీష్మ: అర్జునా! ఆశిఖండిని వెనుకకుతీసుకో. నీబాణములకున్ను నాబాణములకున్ను మధ్య నలిగిపోతుంది, పాపము.

శిఖండి: నలిగిపో 'తుంది'? ఏమి తాతగారూ, చిరబ్రహ్మచర్యము చేత లింగపరిజ్ఞానశూన్యు లయినట్లున్నారు. నా పేరు శిఖండి, నేను ద్రుపదమహారాజ "పుత్త్రి"డను.

భీష్మ: అవును, నీవృత్తాంతమంతా నాకు తెలుసును.

శిఖండి: తమ వృత్తాంతము నాకంతకంటే తెలుసును.

భీష్మ: ఏమే, ఎప్పుడో చస్తివనుకొన్నాను. ఇంకా నీపట్టుదల విడువలేదూ ?

శిఖండి: నాకు 'మొండిశిఖండి' బిరుదమును నాడు తామేకదూ ప్రసాదించినది ?

భీష్మ: అర్జునా, ఈ శిఖండి నాయెదురుగా ఉన్నంతకాలము నేను బాణములు ప్రయోగింపను. నీయిష్టము వచ్చినట్లు నన్నుకొట్టు.

శిఖండి: భీష్మా, నిన్ను కొట్టడానికి అర్జునుడు కావలెనా? నేనున్నాను చాలదూ? కాచుకో!

(బాణము సంధిస్తున్నాడు. అర్జునుడుకూడా బాణముసంధించి, శిఖండి చెవిప్రక్కగా వింటిని లాగుతున్నాడు.)

శిఖండి: అర్జునా, నీవూరుకో. ఇప్పటికే నాచెవులు చెవుడెత్తి పోయినవి. ఉన్న చెవులుకూడా ఊడబీకేట ట్లున్నావు.

అర్జు: శిఖండీ, నీవు భీష్ముని నొప్పించనైనా లేవు. నీకెందుకు? ఉండు, నేను చూచుకొంటానులే.

శిఖండి: భీష్ముని కొట్టినగౌరవం నాకురావడం నీకిష్టములేదేమో! నేనొప్పుకోను. అతనిని నేనేకొట్టాలి. ఆగౌరవం నాకే రావాలి. నన్ను కొట్టనియ్యకపోతే దిష్టిబొమ్మవలె మెడలు నొప్పిపెట్టుకొంటూ నీముందు నేను నిలబడలేను. ఎంతసేపీకొయ్యబొమ్మవేషం? నేనుపోతాను,

అర్జు: అయితే నీవే కొట్టు.

[శిఖండి బాణమును వదలబోతున్నాడు.]

భీష్మ: (నవ్వుతూ) శిఖండీ, నీవెందుకు బాణాలు ఖర్చుపెట్టు కొంటావు? నాకు చక్కిలిగింత అవుతున్నది. అర్జునుడే కొట్టనీ!

శిఖండి: చక్కిలిగింతలూ? ఏమి తాతా, ముసలికాలానికి నాతో ముచ్చటలుగా ఉన్నదా? ఈముచ్చటలు చిన్ననాడే ఉంటే బాగుండునే!

భీష్మ: మరదలూ, నీముచ్చట లానాడు నాతమ్ముడు విచిత్ర వీర్యునితో ఆడడానికిష్టపడితే, నీకూనాకూ ఇంత పుట్టక పోవునే! నీవూ నేనూకూడా బ్రతికిపోదుమే. ఈపాటికి ముసలిముత్తైదువవై ఎంతో గౌరవము సంపాదించి ఉందువే.

శిఖండి: అర్జునా! వింటున్నావా ఈ ముసలాయన మాటలు? ఎంతపొగరు! బావా, ఏదీ ఒక్కదెబ్బ తీసుకో, చూదా మీ మిట్టిపడడమేమిటో.

అర్జు: కొట్టనా? నీకుకోపం లేదుగదా!

శిఖండి: చూస్తావేం, కొట్టు, నేనేమీ అనుకోనులే.

అర్జు: గురువుగారూ, కాచుకోండి.

(పరిక్రమిస్తున్నారు)

[పునఃప్రవేశము]

భీష్మ: ఓహో! ఈ బాణములు పిడుగులవలె పడినవి. ఇవి అర్జునుని బాణములుకాని, శిఖండివి కావు. కర్కాటీ గర్భమువలె ఇవి కడుపును చీల్చినవి; ఇట్టి బాణములు శిఖండికెక్కడివి? బ్రహ్మదండమువలె మర్మములను నొప్పించే యీ నేర్పు శిఖండి కెక్కడిది? యమదూతలు ప్రాణములు తీసినట్లున్నది. ఇంత నొప్పికలిగినట్లు శిఖండి కొట్టగలడా? అర్జునా, చాలాబాగా కొట్టినావోయ్. నీ లక్ష్యశుద్ధికి మెచ్చుకొన్నాను.

శిఖండి: మెచ్చుకొన్నాను? ఉండు, అయిందీ!

కృష్ణ: అర్జునా, భీష్ముని అవస్థచూచి ద్రోణు డశ్వత్థామను సహాయముగా పంపుతున్నాడు. కౌరవబలములన్నీ ఒక్కుమ్మడిగా ఈవైపునకే వస్తున్నవి. వారు భీష్మునితో కలియనీయకూడదు, పద. (పరిక్రమిస్తారు.)

భీష్మ: నేటికి నా అవతారము చాలించుకొనేదినము వచ్చినది. అంతకంతకూ నాబలము తరిగిపోతున్నది. బాణప్రయోగ శుద్ధి తప్పిపోతున్నది. ఏ మీఅపశకునములు ! కురుసేన మీద గ్రద్దలాడుతున్నవి. అదిగో ఉల్కాపాతము. నక్కలకూతలు వినబడుతున్నవి. నేను దుర్యోధనుని అన్నము తిన్నందుకు మాటయిచ్చినంతసహాయమున్న చేసినాను. ఋణవిముక్తుడనయినాను. (ఆకాశమువంక చూచి) ఓహో! ఎవరువీరు ! ఆఁ! నాఅన్నలు వసువులు. అన్నలారా ! ఏలవచ్చినారు? "భూమిపై నీవుచేయవలసిన పని సరి, ఇంక రా" అంటున్నారా? సరే, వస్తున్నాను. ఈపక్క వీరెవరు? నాతల్లి గంగ, రమ్మని పిలుస్తున్నది. అమ్మా, నమస్కారము. నీపవిత్రగర్భములో నన్ను కని ధన్యాత్మునిచేసిన కరుణామయివి. వస్తున్నానమ్మా, నీకౌగిటిలోనికి!...ఓహో ! దేవతలు, సంతోషముతో నృత్యముచేస్తున్నారు. పళ్లెరాలలో పువ్వులుపట్టుకొని ఉన్నారు. దేవతలారా! నే నంతటిగౌరవమునకు అర్హుడను కాను. నేను మీ సేవకుడను నా విధిని నిర్వర్తించు కొన్నాను. అంతే...(నేపథ్యమువంక చూచి) వీడెవడో నాపైకి వస్తున్నాడు, విరటుని తమ్ముడు శతానీకుడు.

శతానీకా, నన్ను చంపినగౌరవము నీకుకూడా కావలెనా? ఇదిగో (బాణమువదలుతున్నాడు.)...చచ్చె...ఈప్రక్క అర్జును డెంతటిపరాక్రమము చూపుతున్నాడు. సెబాస్, నాశిష్యుడవౌదువురా, అర్జునా! ఏమి అశ్వత్థామా, పారిపోతున్నావు? అయ్యో, దుశ్శాసనా, ఇంతేనా నీపస, దుర్యోధనా, తొందరపడి అర్జునుని కెంను కెదు రయినావోయ్. పాపము, కురుసేనలు పంచబంగాళీ-ముగా పారిపోతున్నవి. అదిగో కృష్ణార్జును లీవంకకే వస్తున్నారు. ఓహో, ఏమి యీఅర్జునుని కాలరూపము! ఏమి యీ కృష్ణుని విశ్వమూర్తి! విశ్వమయా, నీకు నమస్కారము, అనంతా, నీఅనంతవిలాసములలో ఇది ఒకలీల, భక్తప్రియా, ఇదిగో నీకుపహారముగా అర్పించు కొంటున్నాను, ఈభక్తునికోర్కను స్వీకరించు.

[కృష్ణార్జునులు, శిఖండి, ప్రవేశము]

కృష్ణు: అర్జునా, ఇక ఆలస్యముచేయకూడదు. కాలాతీతమవు తున్నదని దేవత లాతురపడుతున్నారు. అంశుమంతుడు శాంతుడవుతున్నాడు. శాంతనవునికికూడా మనశ్శాంతి కలుగవలసి ఉన్నది.

శిఖండి: ఇప్పుడు నేనుచేయవలసినపని యేమయినా ఉన్నదా? ఎంతసే పిట్లానిలబడడము?

కృష్ణు: శిఖండీ, ఒక్కక్షణ మోపికపట్టు, భీష్ముడు పడగానే మీసము తీసివేసుకొని ఇంటికి పోవచ్చునులే,

ఖండి: అయితే బిరీన కానియ్యండి మరి.

అర్జు: గురువరా, నన్ను క్షమించవలెను. తాము నాపై బాణములు ప్రయోగించకపోయినా, నేను మిమ్ముకొట్టవలసి వచ్చినది. ఏమి చేయగలను? నీవు పాండవపక్షపాతివి, మాకు జయముకలుగవలెనని ఆశీర్వదించినావు, నీవు విల్లుపట్టితే మేముగెలువలేము, నీవు విల్లుపట్టక నేను నిన్ను కొడితే సరివీరులలో నాకు నవ్వుబాటు.

భీష్మ: అర్జునా, సందేహింపకు. కొట్టు, నీకెట్టి అవమానమున్ను లేదు; నీవింటినేర్పు నేనిచ్చినదేకదా. నేనుపడితే నన్ను నే జయించుకొన్నట్టే,

శిఖండి: తాతగారూ, అయితే నేను కొట్టనక్కరలేదూ?

భీష్మ: శిఖండీ, నీహాస్యరూపము నాకు పరమోపకారమైనది.

నీది కారణజన్మము. నీకున్న నేను కృతజ్ఞుడనే. నీఓపినకొద్దీ నీవున్నకొట్టు,

(నేపథ్యమునకు పోతున్నాడు)

అర్జు: గురువరా, ఇవిగో (బాణములు వదలుతున్నాడు)

భీష్మ: (నేపథ్యము నుండి) బలే. బలే.

శిఖండి. తాతగారూ, ఇవిగో నావి....ఏమి, బలే, బలే, అనరేమి?

(కృష్ణార్జునశిఖండులు నిష్క్రమిస్తున్నారు.)

## రంగము ౫.

[ శరతల్పగతుడై భీష్ముడు, కృష్ణార్జునశిఖండులు ]

భీష్మ: దేవతలారా! మహర్షులారా! నేను దక్షిణాయనమున శరీరత్యాగము చేస్తానని భయపడకండి. నాతండ్రి శంతనుడు నాకు స్వచ్ఛందమరణమును ప్రసాదించినాడు. ఉత్తరాయణప్రవేశ మయినతరువాతనే స్వర్గగామినౌతాను. అర్జునా, నాతల క్రిందుగానుందోయి, తలక్రింద ఏదయినా ఎత్తుపెట్టు.

శిఖండి: ఇక్కడ తలగడలెక్కడవస్తాయి? ఏమిదారి?

# మొండి శిఖండి

భీష్మ: అర్జునా, నిన్నూ అడిగినది!

అర్జు: చిత్తము. (ఒక బాణమును భూమిలోనికి కొట్టి భీష్ముని తలను ఎత్తుగా ఉంచుతున్నాడు.)

భీష్మ: అర్జునా, నా శిష్యుడ వవుదువోయి. ఇదిగో, చాలా దప్పిక అవుతున్నది.

శిఖండి: (నీళ్లు తెచ్చి) తాతగారూ, నేను మీయెడల మహాపరాధము చేసినాను. నామీద దయఉంచి ఈ తీర్థము పుచ్చుకొంటే నా మనస్సుకు తృప్తి అవుతుంది.

భీష్మ: శిఖండీ, నీమీద నాకట్టి కోపమున్ను లేదు. కాని, నేను కోరిన దీనీళ్లు కాదు. అర్జునుడు తెస్తాడులే. అవి నీవిచ్చి నట్టే అనుకొంటాను.

(అర్జునుడు బాణమును భూమిలోనికి వేసి జలమును భీష్మునినోటిలో పోస్తున్నాడు)

భీష్మ: ఆహా, అర్జునా, ప్రాణములు లేచివచ్చినవోయ్, నా తల్లి గంగాదేవి స్తన్యపానము చేసినట్లున్నది.

కృష్ణ: భారతపితామహా, నీకింకా ఏమికావలెను?

భీష్మ: కృష్ణా, లీలామానుషవిగ్రహా! నాకింకా ఏమికావలెను? నీఅనుగ్రహ మీఅర్జునునిమీద ఉండనీ. ఈ అర్జునుడు భారతీయసంతతికి పరమలక్ష్యప్రాయుడు కానీ. భారత మాత గర్భమున అర్జునునివంటి పరాక్రమశాలులు, కర్ణుని వంటి దానవీరులు, శిఖండివంటి పట్టుదలగల కార్య సాధకులుకూడా పుట్టనీ. ఈ జగమున కంతటికీ మంగళము కానీ.

కృష్ణ: అట్లే అగుగాక. (తెర)

---